AL - HILAL

నెలవంక

మాస పత్రిక

ముహర్రమ్ హిజ్రీ శకం 1433

Vol 8, Issue: 62 DECEMBER - 2011

مجلة الهلال (باللغة التلغوية) - ملحق مجلة البشرى



ఎవరు బాధ్యులు?

- కుటుంబ సభ్యుల గురించి ఎలాంటి శ్రద్ధ తీసుకోకుండా సంపాదన గురించే ఆలోచించుకుంటూ ఉండిపోయిన తండ్రి బాధ్యుడా?
- అడిగినప్పుడల్లా డబ్బు ఇస్తూ వచ్చిన తల్లి బాధ్యురాలా?
- డబ్బు ఇవ్వకపోతే తన కుమారునికి ఈ అలవాటు తప్పుతుందని డబ్బులివ్వటానికి నిరాకరించిన తల్లి మమతదా బాధ్యత?
- స్నేహం పేరుతో పాడు చేసిన ఫ్రెండ్స్ బాధ్యులా?
- ఎలాంటి అనుభవం లేకుండా హెరాయిన్‌కి అలవాటు పడ్డ కుమారుడా?
- మాదకద్రవ్యాలను అమ్ముతున్న వారిని పట్టించుకోని ప్రభుత్వమా?

IPC
لجنة التعريف بالإسلام
ISLAM PRESENTATION COMMITTEE
جمعية النجاة الخيرية

جمعية النجاة الخيرية



ఇదియే ఇస్లాం

(ఓ ప్రవక్తా!) వారి (ప్రజల)కి చెప్పు: “రండి, మీ ప్రభువు మీపై నిషేధించిన వస్తువులు ఏవో మీకు చదివి విన్పిస్తాను. అవేమంటే;

- అల్లాహ్‌కు సహవర్తులుగా ఎవరినీ కల్పించకండి.
- తల్లిదండ్రుల ఎడల ఉత్తమ రీతిలో మెలగండి.
- పేదరికపు భయంతో మీ సంతానాన్ని హతమార్చకండి.
- మీకూ మరియు వారికీ జీవనోపాధిని ప్రసాదించేవారము మేమే.
- సిగ్గుమాలిన పనులు- అవి బాహాటంగా జరిగేవైనా, గుట్టుగా జరిగేవైనా - వాటి దరిదాపులక్కూడా వెళ్ళకండి.
- సత్య (న్యాయ) బద్ధంగా తప్ప అల్లాహ్ నిషేధించిన ఏ ప్రాణినీ హతమార్చకండి.
- మీరు ఆలోచించి పని చేస్తారని, అల్లాహ్ మీకీ విషయాలను గురించి గట్టిగా తాకీదు చేశాడు.
- తండ్రి లేని బిడ్డ, యుక్త వయస్సుకు చేరుకునే వరకూ - ఉత్తమ రీతిలో తప్ప - అతని ఆస్తి దరిదాపులకు కూడా వెళ్ళకండి.
- కొలతలు తూనికలలో పూర్తిగా, న్యాయంగా వ్యవహరించండి.
- మేము ఏ ప్రాణిపైన కూడా దాని శక్తికి మించిన భారం మోపము.
- పలికితే న్యాయమే పలకండి.
- న్యాయసమ్మతంగా మాట్లాడండి - వ్యవహారం మీ బంధువులకు సంబంధించినదైనా సరే!
- అల్లాహ్‌తో చేసిన బాసను నెరవేర్చండి.
- మీరు సదా జ్ఞాపకం ఉంచుకనేందుకు అల్లాహ్ మీకు ఈ విధంగా తాకీదు చేశాడు”.

-(దివ్యఖుర్ఆన్- 6: 151-152)

సామాజిక, సాంస్కృతిక, సందేశాత్మక మాస పత్రిక

నెలవంక

(AL-HILAL MONTHLY)

Vol 8, ISSUE: 62
DECEMBER 2011

PHONE
Syed Abdus Salam Omeri
97248933

FAX
22400057

P.O.BOX: 1613
SAFAT-13017, KUWAIT

PUBLISHED BY
IPC
Islam Presentation Committee
Kuwait
www.ipc.org.kw

DESIGN
Nader Belal

www.zukhruf.net
Tel. 99993072

ఈ సంచికలో....



ఏ ఆంక్షలు నిషేధించినా...

చీకటి నుండి వెలుగు వరకు





పగటి కల - పగిలిన తల



“మత్తు కలిగించే ప్రతిదీ నిషిద్ధమే”.
(ముస్లిం)



మార్పు - తీర్పు

ఈ కాలం; దేని అంచులపై మనం నేడు నిలబడి ఉన్నామో అది చరిత్రలో ఎంతో కీలకమైన సందర్భం. గత ఏడాది చోటు చేసుకున్న ప్రజా విప్లవాలు, నిరంకుశ పాలకుల నియంత్రణ దీనికి ప్రబల కారణం. కాలం ఒక ప్రవాహం. ఇది ప్రవహిస్తూనే ఉంటుంది. ముహర్రం నుంచి ముహర్రం దాకా. కష్టాల్, నష్టాల్, సుఖాల్, దుఃఖాల్ మామూలే. వస్తుంటాయి..పోతుంటాయి. కాలం ఆగదనే విషయం మరచిపోకూడదు. జనం కూడా అంతే. వస్తుంటారు, పోతుంటారు. ఈ జగతిలో ఏదీ శాశ్వతం కాదు. జగత్ప్రభువైన అల్లాహ్ ఇలా సెలవిస్తున్నాడు: **"మేము ఈ కాల చక్రాన్ని జనుల మధ్య త్రిప్పుతూ ఉంటాము".** (దివ్య ఖుర్ఆన్-3: 140) మరో చోట ఇలా అన్నాడు: **"పోయే దానిపై మీరు దుఃఖించకుండా, ప్రసాదించబడిన దానిపై మిడిసి పడకుండా ఉండాలని (మేము ఈ ఏర్పాటు చేశాము)".** (దివ్యఖుర్ఆన్-57: 23)

ఈ సంవత్సరం పోవటం, మరోకటి రావటం ఇదంతా మనుషులమైన మనం నియంత్రించలేని ఒక అద్భుత కాల చక్రం. నూతన హిజ్రీ సంవత్సరం వస్తుందనగానే అదేదో నూతనత్వాన్ని తీసుకు వస్తుందనే భావనతో ఉండటం కాదు. గత సంవత్సరంలో అనుకున్నవి ఇప్పటి వరకూ శ్రమించి ఎంత వరకూ సాధించామో....ఆ విజయాలే మన జీవితంలో నూతనత్వాన్ని, నూతనోత్తేజాన్ని, ఆనందాన్ని నింపుతాయి...అంతేగానీ మారే అంకెలు కాదు. రాబోతున్న నూతన హిజ్రీ సంవత్సరాన్ని సాదరంగా ఆహ్వానించినట్టే జీవితంలోకి నూతనత్వాన్ని తెచ్చే సరికొత్త ఆలోచనలను సయితం మనం మన మనసుల్లోకి ఆహ్వానించాలి.

సందర్భం ఏదైనా, హితులు, స్నేహితులు, కుటుంబ సభ్యులతో సంతోషంగా గడపాలనీ కోరుకోవడంలోనూ, అలా గడపటంలోనూ ఎలాంటి తప్పు లేదు. కానీ ప్రవక్త ముహమ్మద్ (స) గారి మనవడి వీర మరణాన్ని ముహర్రంతో ముడిపెట్టి, స్వర్గవాసుల్లో యువనాయకుడైన హజ్రత్ హుసైన్ (ర) గారి పేరుతో జరుగుతున్న కార్యక్రమాలు చూస్తే...నేటి యువత ఎటువైపు పయనిస్తున్నదన్న ఆవేదన, ఆందోళన కలగక మానదు. అర్ధ రాత్రి వేళ దాకా యువకులు, ధర్మాన్ని మరియు ప్రవక్త (స) వారి సంప్రదాయాన్ని మరచి, కర్బలా సంగ్రామం పేరుతో చిత్రవిచిత్రకారాలను భుజానెత్తుకొని నిప్పులు తొక్కుతూ, చేసే వెకిలి చేష్టలు, చుట్టూ నిలబడి ప్రజలు కొట్టే చప్పట్లు వెర్రి తలలు వేస్తున్న విషసంస్కృతికి పరాకాష్ఠగా నిలుస్తున్నాయి. ఇంకా చావడీల దగ్గర, గల్లీల్లో ఊరేగింపులు చేస్తూ, రోడ్డు మీద తప్పతాగి చిందులు తొక్కే వారి పరిస్థితి వర్ణించలేము. ఈ పది రోజులు రాత్రుళ్లు మద్యం మత్తులో వారు చేసే అల్లరి అంతా ఇంతా కాదు. పవిత్రమైన ఈ మాసంలోని పదవ తేది (ఆషూరా) విశిష్టత నేటి యువతకు తెలుసో తెలియదోగానీ ఈ పవిత్ర మాసం స్వాగతం పేరుతో, హజ్రత్ హుసైన్ (ర) గారి విషాద గాథ సాకుతో ప్రవక్త (స) వారి కుటుంబమే సిగ్గు పడేలా వెర్రి గంతులు వేయటం ఎంతో అవమానకరం. అన్నీ తెలిసిన అల్లాహ్ ఇలా విశద పరుస్తున్నాడు: **"దైవగృహం వద్ద ఈలలు వేయటం, చప్పట్లు కొట్టడం మినహా వారు చేసే ప్రార్థన మరేముంది? కనుక మీ సత్య తిరస్కారానికి ప్రతిఫలంగా శిక్షను చవి చూడండి".** (దివ్యఖుర్ఆన్- 8: 35)

అంటే, ముస్లింలమైన మనం చేసే ప్రతి కార్యం శాంతితో కూడినదై ఉండాలి. విషాద సమయమైనా, సంతోష సందర్భమైనా సరే. కానీ నేడు ఓ ప్రక్క పాశ్చాత్య దుష్కృతికి బానిసలై యువతులు సయితం యువకులతో శృతి కలిపి చెట్టాపట్టాలేసుకు తిరగటానికి ఆరాట పడుతూ ఇస్లామీయ సంప్రదాయాలను కాల రాస్తుంటే, మరోవైపు విగ్రహారాధకుల ఆచారాలకు ప్రభావితులై ఇస్లామీయ మౌలిక సిద్ధాంతాలనే రక్తసిక్తం చేస్తున్నారు. వాస్తవాలు తెలిసిన పెద్దలు కూడా దీన్ని అరికట్టలేకపోతున్నారు. కాలంతో కలవకపోతే కాలదోషం పట్టినవారి క్రింద జమ కడతారేమోనని భయంతో వారు మౌనం వహిస్తున్నారు. తత్ఫలితంగా- విగ్రహారాధకుల ఆచారాల హోరు, పాశ్చాత్య (అ) నాగరికత జోరు ప్రభావం క్రమేణా ధార్మిక కుటుంబాలకు సయితం పాకుతున్నది. ఇస్లామీయ జన జీవన స్రవంతిలో విలీనమై భాసిల్లుతున్న ప్రవక్తల సంస్కృతీసంప్రదాయాలు క్రమేపి ఈ రెండు అనాగరికతల వెల్లువలో కొట్టుకుపోతున్నాయి.

ఒకప్పుడు మనం వేసే ప్రతి అడుగులోనూ ఇస్లామీయ సంస్కృతీ సంప్రదాయాల విశిష్టతాపరిమళాలు గుభాళిస్తుండేవి. మన ప్రతి మాటలోనూ సభ్యత, సంస్కారం తొణికిసలాడుతుండేది. కాని ఇప్పుడో! కాలాన్ని క్యాలండర్‌తో కొలుస్తూ పీర్ల పండుగలు, పూలదండలతో పవిత్ర ముహర్రం మాసపు అత్యంత విలువైన ఘడియల్ని వృథా పరుస్తూ, ఆ తర్వాత పరస్పర అభినందనలతో మురుస్తూ, కాలాన్ని నిర్లజ్జగా ఖర్చు పెట్టేస్తున్నాము. గల్లీల్లో, చావడీల్లో, క్లబ్బుల్లో, పబ్బుల్లో సినిమా హాళ్లల్లో విందులతో, చిందులతో మానవత్వాన్ని మరుస్తున్నాము. ఆయువు మాత్రం కొవ్వొత్తిలా కరుగుతూనే పోతూ ఉంది.


ఒకవైపు ఇస్లాం ధర్మం పట్ల అవగాహనలేని వల్ల ముస్లిమేతరులు అపార్థానికి గురవుతుంటే, మరోవైపు ముస్లింలు ధర్మం పట్ల పూర్తి నిర్లక్ష్యంతో జీవిస్తున్నారు. వారు చేస్తున్నది తప్పు అన్న అవగాహన కలిగించే చెప్పుకోదగ్గ ప్రయత్నమూ జరగడం లేదు. నగరాల్లో అక్కడక్కడా ధార్మిక కార్యక్రమాలు జరుగుతున్నప్పటికీ, గ్రామాల్లో, మారుమూల ప్రాంతాల్లో నివసించే ముస్లింలకు అవి అందుబాటులో లేవు. ఇస్లాం గురించి అంతంత మాత్రమే అవగాహన ఉన్న అలగాజనాలు అనేకం అక్కడి ప్రజల్ని అపమార్గం పాల్జేస్తూ పబ్బాలు గడుపుకుంటున్నారు. కనుక మంచి పండితులు చేసే ప్రసంగాలను, వారు చెప్పే ప్రవక్తల గాథలను సిడి, డివిడి రూపంలోనూ, అక్షర రూపంలో నిరుపేద, మధ్య తరగతి, ధనిక గ్రామీణ ప్రజలకు అందేటట్టు చూడాలి. ముస్లిం సమాజంలో విపరీత ధోరణులు చూపుతున్న ఈ విష సంస్కృతికి చరమ గీతం పాడేందుకు ముస్లిం యువత కంకణం కట్టాలి.

ఈ పవిత్ర మాసంలో సత్య ధర్మ రక్షణ కోసం ప్రాణాలర్పించిన హజ్రత్ హుసైన్ (ర) మన యువతరానికి ఇహపరాల్లో తిరుగు లేని నాయకుడు. మన రక్తం ఆయన రక్తంకంటే పవిత్రమైనదేమీ కాదు, మన ప్రాణం ఆయన ప్రాణంకంటే విలువైనదేమీ కాదు. కాని మన లక్ష్యం, ఆయన లక్ష్యం ఒక్కటే. కనుక అందరి కోసం కాకపోయినా కొందరి కోసమైనా ఆదర్శం కాగలిగేలా బ్రతకాలి మనం. కాలగ్రంథంలో తొలి పుటల్లో కాకపోయినా ఆఖరి పుటల్లో చివరి పదంగానైనా మిగిలాలి మనం. అనంతాకాశంలో సూర్యునిలా కాకపోయినా చిన్న తారగానైనా వెలిగాలి మనం.

రక్తం - జీవాన్నిచ్చే ద్రవం

రక్తం యొక్క ప్రధానమైన విధులు

మన శరీరానికి జీవాన్నిచ్చే ద్రవమే రక్తం. అది మన శరీరంలో ప్రసరణ జరుగుతున్నంత కాలం, అది శరీరాన్ని వేడిగా, చల్లగా, పోషణనిస్తూ మరియు హానికరమైన వాటిని శుభ్రపరచడం ద్వారా మనకు రక్షణనిస్తుంది. మన శరీరాలలో సందేశాలను అందించే విషయంలో దాదాపుగా ఈ రక్తమే పూర్తి బాధ్యతను తీసుకుంటుంది. అంతేకాకుండా నరాల గోడలలోని పగుళ్ళను వెంటనే రిపేర్ చేసి, వ్యవస్థకు తిరిగి కొత్త జీవాన్నిస్తుంది.



సగటున 60 కేజీల బరువుండే మానవుని శరీరంలో దాదాపు 5 లీటర్ల రక్తముంటుంది. ఈ మొత్తం రక్తాన్ని మన శరీరంలో సులభంగా ప్రసరణ చేయడానికి మన గుండెకు 8 సెకన్లు చాలు. అయినప్పటికీ, పరుగెత్తేటప్పుడుగాని, ఎక్సర్‌సైజ్‌లు చేసేటప్పుడుగాని, ఈ రక్త ప్రసరణ వేగం ఓ 5 రెట్ల వరకూ పెరగగలుగుతుంది. మన తల వెంట్రుకల కుదుళ్ళ నుండి, కాలి వ్రేళ్ళ వరకూ, వేర్వేరు సైజులలో నున్న దమనుల లోపల ప్రతీచోటుకి రక్తం ప్రవహిస్తుంది. రక్తం ప్రవహించడానికి ఏ అడ్డూ లేకుండా, ప్రవాహంలో ఏ ఘనపదార్థం తయారవ్వకుండా దోషరహితమైన నిర్మాణంతో నరాలను సృష్టించడం జరిగింది.

ఖుర్ఆన్‌లో అల్లాహ్ ఇలా సెలవిస్తున్నాడు: "ఆయన ఒకదానిపై నొకటి ఏడు ఆకాశాలను సృజించాడు. నీవు కరుణామయుని సృష్టిలో ఎలాంటి క్రమరాహిత్యాన్నీ చూడలేవు. కావాలంటే మరొకసారి చూడు, అందులో నీకేమైనా లోపం కనిపిస్తున్నదా? మళ్ళీ మళ్ళీ చూడు, నీ చూపులు అలసిపోయి విఫలమై వెనుకకు తిరిగి వస్తాయి. (దివ్యఖుర్ఆన్:67:3)


ఎన్నో రకాల పోషక పదార్థాలు మరియు వేడి, ఈ సంక్లిష్ట వ్యవస్థ ద్వారా తీసికెళ్ళబడతాయి.

ఆక్సిజన్ కారియర్

మన మనుగడకు చాలా ప్రధానమైనది మరియు మూలాధారమైనది – మనం పీల్చే గాలి. కొయ్య దుంగను మండించినట్లు, 'సుగర్'ని మండించడానికి మన జీవకణాలకి ఆక్సిజన్ కావాలి. ఆ సుగర్‌ను మండించడం ద్వారా శక్తి ఉత్పత్తి అవుతుంది. అందుకే మన ఊపిరితిత్తుల నుండి జీవకణాలకు ఆక్సిజన్ తీసుకెళ్ళబడుతుంది. పైప్‌లైన్లను కలిపే అల్లిక వలే ఉండే ఈ రక్త ప్రసరణ వ్యవస్థే ఆక్సిజన్‌ను తీసుకెళుతుంది.

ఎర్ర రక్త కణాల్లోని హిమోగ్లోబిన్ పరమాణువులు ఆక్సిజన్‌ను తీసుకు వెళతాయి. డిస్క్ ఆకారంలో ఉండే ఎర్రరక్తకణంలోని ప్రతీ రక్త కణం దాదాపు 300 మిలియన్ల(30 కోట్ల) హిమోగ్లోబిన్ పరమాణువులను తీసుకువెళుతుంది. ఈ రక్త కణాలు దోషరహితమైన నిధానాన్ని చూపుతాయి. అవి ఆక్సిజన్‌ను తీసుకు వెళ్ళడమే కాకుండా ఎక్కడ ఆక్సిజన్ అవసరమో అక్కడే ఆక్సిజన్‌ను విడుదల చేస్తుంటాయి. ఉదా: కండరాల కణంలోని ఎర్ర రక్త కణాలు టిష్యూలకు ఆక్సిజన్‌ను అందిస్తాయి. చక్కెరను కాల్చడం వలన ఉత్పన్నమైన కార్బన్ డైయాక్సైడ్‌ను తీసుకుని తిరిగి వెనక్కు అంటే ఊపిరితిత్తులకు చేరుకుని అక్కడ వదిలేస్తాయి. మరలా అక్కడి నుండి ఆక్సిజన్‌ను తీసుకుని, టిష్యూలకు తీసుకెళతాయి.

పీడన సమతుల్య ద్రవం



ఆక్సిజన్‌తో పాటు హిమోగ్లోబిన్ పరమాణువులు నైట్రోజెన్ మోనాక్సైడ్‌ను మోసుకెళతాయి. ఈ గ్యాస్ కనుక బ్లడ్‌లో లేకపోతే, రక్తం యొక్క ప్రెషర్ స్థిరంగా మారిపోతూ ఉంటుంది. టిష్యూలకు ఎంత మోతాదులో ఆక్సిజన్‌ను అందివ్వాలో, నైట్రోజెన్ మోనాక్సైడ్ ద్వారా హిమోగ్లోబిన్ క్రమబద్ధీకరిస్తుంది.

ఇక్కడ వింత ఏమిటంటే, ఇలా క్రమబద్ధీకరించేది ఏమిటో కాదు ఓ పరమాణువు. ఈ పరమాణువుకి బ్రెయిన్‌గాని, కళ్ళుగాని ఉండవు. మన శరీరాలని క్రమబద్ధీకరించేవి 'కొన్ని పరమాణువుల సముదాయం'. ఇది దోషరహితంగా మన శరీరాలని సృష్టించిన అల్లాహ్ యొక్క అనంత జ్ఞానానికి సూచన.

కణాల (సెల్స్) యొక్క ఆదర్శ డిజైన్

రక్తకణాలలోని మెజారిటీ రక్తకణాలు ఎర్ర రక్త కణాలే. పురుషుని రక్తం 30 బిలియన్ ఎర్ర రక్త కణాలను కలిగి ఉంటుంది. వాటి ఉపరితలాలను కలిపితే ఫుట్‌బాల్ మైదానంలో దాదాపు సగం ఉంటుంది. ఈ కణాలే రక్తానికి ఆ రంగును ఇస్తాయి.

ఎర్ర రక్త కణాలు చూడటానికి డిస్క్‌ల్లాగా ఉంటాయి. ఆశ్చర్యాన్ని కలిగించే వాటి మెత్తదనం (ఫ్లెక్సిబిలిటి) వలన, వెంట్రుక వాసినాళాల నుండి, సూక్ష్మమైన రంధ్రాల నుండి అవి పీల్చబడతాయి. అవి అంత ఫ్లెక్సిబుల్ కాకపోతే, అవి శరీరంలోని చాలా చోట్ల అడ్డుపడిపోయి ఉండేవి.

ఒక అంగుళం వెడల్పున్న దానిని 10 లక్షల భాగాలుగా చేస్తే, ఆ విధంగా భాగాలైన సూక్ష్మ భాగాలలోని 39 భాగాలను కలిపితే ఎంత సూక్ష్మమైన వెడల్పు ఉంటుందో, అంత సైజు ఉంటుంది ఒక్కొక్క ఎర్ర రక్తం. ఈ రక్త కణం తనకంటే చిన్నదైన అంటే తన సైజులో మూడింట రెండు వంతులుండే రక్త నాళం (క్యాపిల్లరీ) గుండా పోగలుగుతుంది.

అంత ఫెక్సిబుల్ (మెత్తదనం)తో ఎర్రరక్త కణాలను సృష్టించకపోయి ఉంటే ఏం జరిగుండేది? **'డయాబెటిస్'** పరిశోధకులు ఈ ప్రశ్నకు కొన్ని సమాధానాలు చెప్పారు. డయాబెటిక్ రోగులలో, ఎర్ర రక్తకణాలు తన మెత్తదనాన్ని కోల్పోతాయి. ఇలా మెత్తదనం కోల్పోయిన రక్తకణాలు రోగి యొక్క కన్నులలోని సున్నితమైన టిష్యూలలో ఆగిపోవడం వలన, గుడ్డితనానికి దారి తీస్తాయి

(మిగతాది 12 పేజీలో)

శాంతి ప్రియ

ఏ ఆంక్షలు నిషేధించినా...

ఆ నలుగురు కాలి బాటన నడిచి వెళుతున్నారు. దారి ఆవల కొందరు కూలీలు కూని రాగాలు తీస్తూ పని చేసుకుంటున్నారు. అదో అడవి ప్రాంతం. సంజయ్, యోసోబు, వహీద్, ప్రేమ్ సింగ్ - వారి పేర్లు. వారికి ఎందుకో ఆ కార్మికుల్ని పలుకరించాలనిపించింది. ఆ కర్షకుల్లో ఒకాయన ముసలివాడు. గడ్డాలు, మీసాలు బాగా పెరిగి బక్కచిక్కిన శరీరం. ఆ శరీరానికి పట్టుకొని వేలాడుతున్న బుడ్డగోచి ఒకటి. ఆ పెద్దాయన వాలకం, ఆయన చేస్తున్న పని తీరు వారిని బాగా ఆక ర్షించింది. అందరూ వెళ్ళి వారితో మాటలు కలిపారు. కాసేపట్లోనే వారి మధ్య మంచి పరిచయం ఏర్పడింది. అడవి గురించి కుర్రకారు వేసే ప్రశ్నలకు ఆ పెద్దాయన తన పని తాను చేసుకుంటూనే ఓపికగా సమాధానాలు చెబుతున్నాడు. మాటల్లోనే మధ్యాహ్నం అయిందన్న స్పృహ కూడా వారికి లేదు. కష్టజీవులు కదలి నదిలోకెళ్లి కాళ్లు చేతులు కడుక్కొని వచ్చి తమ తమ సద్దిమూటను విప్పారు. వారిలో ఒకడేమో నది నుండి వేరై ప్రవహిస్తున్న కాలువ మధ్య కూర్చుని బండరాయి మీద ఏదో పచ్చడి నూరుతున్నాడు. ఆ బండ మీద ఓ ప్రక్క ఏదో పచ్చని ఆకు ఉంచబడి ఉంది. చింత పండు, ఎండు మిరప, ఉల్లిపాయలు బాగా దంచిన పిమ్మట ఆ ఆకు వేసి నూరుతుంటే కమ్మనైన వాసన వారి ముక్కుపుటాలకు సోకింది. ఈరోజు ఈ పచ్చడి రుచి చూడాల్సిందేనన్న కోరిక వారిలో మొగ్గ తొడిగింది. అంతలో వారి దృష్టి విప్పిన సద్ది మూటల మీద మళ్ళింది. సంగటి కొన్నింటిలో, కొన్నింటిలో పప్పన్నం కనబడింది. అది చూసిన సంజయ్‌కి తిండికి సంబంధించిన ప్రశ్నలు సుడులు సుడులుగా రాసాగాయి. 'తాము ఇలాగే ప్రతి రోజు పప్పన్నం, సద్దికూడు, పచ్చడన్నం తింటామ' న్న వారి జవాబు విని జాలేసింది సంజయ్‌కి. దాంతోపాటు గతానికి సంబంధించిన కొన్ని జ్ఞాపకాలు మసకమసకగా గుర్తుకు రాసాగాయి. 'పెద్దాయనా! ఈ రోజు మేము తీసుకొచ్చిన బిర్యానీ మీరు తినండి. మీరు పట్టుకొచ్చిన భోజనం మేము తింటాము' అన్న వహీద్ మాటల సవ్వడితో మళ్ళీ లోకంలో వచ్చాడు సంజయ్. అందరూ భోంచేసేందుకు కూర్చున్నారు. అయితే సంజయ్ మాత్రం ఇంకా పరధ్యానంలోనే ఉన్నాడు. పచ్చడి కలిపిన అన్నం తింటుంటే సంజయ్‌కి ఎందుకో అప్రయత్నంగా ఏడుపు తన్నుకొస్తూ ఉంది. ఎంత ఆపాలని ప్రయత్నిస్తున్నా ఆగటం లేదు. కారణం- తనను ఎంతో ప్రేమగా చూసుకునే అన్నయ్య అతనికి గుర్తొచ్చాడు. ఉంటూ ఉంటూ అతను గత జ్ఞాపకాల్లోకి జారుకున్నాడు.

అతని పేరు అజయ్. ప్రశ్నించే స్వభావం. తిరగబడే లక్షణాలు, ఇతరుల పట్ల శ్రద్ధ, ఆసక్తి, దయా, కరుణ, ప్రేమ మొదలగు గుణాల్ని ఓ బొమ్మగా చేసి అందులో ప్రాణం పోస్తే – అదే అజయ్. ఎంతో బుద్ధిమంతుడు. చిన్నప్పటి నుంచి అర్థం కాని ప్రతీదాన్ని ప్రశ్నించే తత్వం అతనిది. ప్రతిగా కొన్ని కొన్ని సందర్భాలలో తిట్లు పడేవి, దెబ్బలు తినేవాడు. ఎందుకంటే అతని ప్రశ్నలు అత్యధికం మతపరమైనవై ఉండేవి. నాన్న ఎంత భయ పెట్టినా అతని తత్వం అతనిది. **'బ్రాహ్మణ కులంలో పుట్టి శూద్రులతో రాసుకుపూసుకు తిరగతావా, మాలమాదుగులతో చెట్టాపట్టాలేసుకుని షికార్లు కొడతావా?'** అని నానా యాతనలు పెట్టినా, శాపనార్థాలు పెట్టినా అతని వాలకం అతనిదే. అతని స్నేహితులందరూ దాదాపు దళితులే. అలా అని అగ్ర వర్ణాల సంబంధించిన స్నేహితులు లేరని కాదు. కానీ, వారు మాత్రం అజయ్‌కి కాస్త దూరంగా మసలుకునేవారు. దళిత జనాలతో కలిసి తిరగాడని ఎన్నో సార్లు బట్టలన్నీ అవతల విడిపించిన తర్వాతనే ఇంట్లోకి రానిచ్చేవాడు నాన్న. ఆయనకున్న ఇద్దరు మగ పిల్లల, ముగ్గురు ఆడ కూతుళ్లలో అజయ్ అందంగా చురుకుగా, తెలివిగా ఉండేవాడు.

బ్రాహ్మణ కులంలో పుట్టి తాను ఇలా ఎందుకు తయారయ్యాడో ఎవరికీ అంతుబట్టేది కాదు. బహుశా అతనిపై పరిసరాల, అమ్మనాన్నల ఆచార ప్రభావం పడలేదేమో కాబోలు! అంటే, అతను ప్రకృతంతటి సహజత్వం మీద ఉండేవాడన్న మాట. అవును అదే నిజం, అతనిలో ఆ సహజ స్వభావమే అతన్ని సహజ ధర్మమైన ఇస్లాం వైపు మళ్ళించింది. దళిత జనవాసాల్లోని వారంతా అతని దోస్తులే. పిల్లల కోడిలాగా ఎప్పుడూ పది మందిని వెంటవేసుకుని వారితోనే కలిసి కాయాకష్టం చేస్తూ, వారి కష్టదుఃఖాలలో పాలు పంచుకుంటూ వారిలోని ఒకడిగా జీవించేవాడు అజయ్.

పై చదువులకంటూ హైదరాబాదు పంపారు అమ్మనాన్న. ఆ విధంగానైనా ఈ పంచముల తో తిరిగే రోత తప్పుతుందన్నది వారి ఉద్దేశ్యం. అయితే పరమాత్మ ఉద్దేశ్యం అట్టిది కాదు, దానికి పూర్తి భిన్నమయినది. అతని జీవితాన్నే గొప్పగా మార్చివేసే ఉద్దేశ్యం అది. అక్కడే అతనికి ఇస్లాం అంటే ఏమిటో? అది తన సహజ స్వభావానికి ఎంత చేరువుగా ఉందో అర్థమయింది. ముస్లింలను, వారి జీవన శైలిని చాలా దగ్గరగా చూసే అవకాశం కూడా అక్కడే లభించింది. పై చదువులు పూర్తి చేసుకుని వచ్చిన పెద్దబ్బాయి పద్ధతి మరింత జఠిలంగా తయారయిందని ఆందోళన చెందిన నాన్న ప్రాయశ్చిత్తం చేయించాలని సంకల్పించాడు.

అది ఎలా అంటే, బట్టలు కుట్టే సూదిని ఎర్రగా కాల్చి నాలిక మీద వాతలు పెడతారు. ఇతర కులాల వాళ్ళ ఇళ్ళల్లో అన్నం తిన్నందుకు అది పాప పరిహారం అన్న మాట. బంధువులందరూ తినీత్రాగిన తర్వాత అలా చెసిన వ్యక్తిని మళ్ళి తమలో కలుపుకుని, మర్యాదస్తుల్లో జమ చేసుకుంటారు. అయితే అన్నయ్య **'ససేమీరా'** అన్నాడు. చివరకు ఒక రోజు తాను ఇస్లాం స్వీకరించినట్లు బాహాటంగానే ప్రకటించాడు. అది విన్న నాన్న తక్షణమే ఇల్లు వదలి వేళ్ళిపోవలసిందిగా గర్జించాడు. అన్నయ్య ఇంటిని వదలి వెళ్ళాడన్న మాటేగానీ, అతని మనసంతా ఇంట్లోనే ఉంటుంది. కొన్నాళ్ళకు మంచి జాబ్‌లో చేరి ఆ తర్వాత అమెరికా నుండి ఓ కంపెనీ ఆఫర్ వస్తే అక్కడికెళ్ళి సెటిలయ్యాడు. ప్రస్తుతం పెళ్ళి చేసుకుని పిల్లాపాపలతో ఉన్న అన్నయ్య ఏడాదికోసారైనా వచ్చి అమ్మనాన్నలను చూసి. ..వారు పెట్టే చివాట్లయినా ఫరవాలేదు సంతోషంగానే విని వెళుతుంటాడు. తనను కూడా ఎన్నోసార్లు అమెరికా వచ్చేయమని సలహా ఇచ్చాడు. కాని సంజయ్ వెళ్ళ లేదు. అమ్మనాన్నలను వదలి వెళ్ళటం అతనికి ఇష్టం లేదు.

ఒకసారి ఏం జరిగిందంటే, అమెరికా నుండి వచ్చిన అన్నయ్య అనాథ ఆశ్రమానికి నన్ను కూడా తీసుకెళ్ళాడు. అక్కడ వారితో కాసేపు గడిపిన మీదట నావైపు తిరిగి– **'ఇతరుల్ని ఆనంద పర్చడంలో గల సంతృప్తి వెల కట్ట సాధ్యం కానిది కానిదిరా!** అంటూ భుజం తట్టాడు. 'చూడు సంజయ్! దేవుళ్ళ పేరు చెప్పి కేవలం మన ఆహాన్ని సంతృప్తి పర్చుకోవడం కోసం–పాలు, పెరుగు, నెయ్యి, తేనె, పళ్ళరసాలు మొదలైన పానీయాలను కుండలకు కుండలు శిలా ప్రతిమల మీద కుమ్మరిస్తూ అవన్నీ మురికి కాలువల్లో కలిసి పోతుంటే పరవశంగా చూస్తుంటాము. ఎందుకు మనం అలా చేస్తాము. అలా చేసినప్పుడు ఒక క్షణమైనా ఈ పేద బ్రతుకుల గురించి, వారి బంగారు భవిష్యత్తు గురించి ఎందుకు ఆలోచించము? 'మానవ సేవయే మాధవ సేవ' అన్న మాటకి ఎంత వరకు మనం కట్టుబడి జీవిస్తున్నాము? కోట్లాది రూపాయల ఆభరణాలతో లక్షలు పెట్టి జరిగిపోయిన పెళ్ళినే మళ్ళి మళ్ళీ జరిపిస్తూ ఉండటం, పట్టు వస్త్రాలంటూ, బంగారు, వెండి, వజ్రాల వాహనాలంటూ, నిమజ్జనం అంటూ ఆ వైభవం అంతా ఎందుకు? ఇవే పథకాల్ని ప్రజా శ్రేయం కోసం, సమాజ సంక్షేమం కోసం ఎందుకు వెచ్చించము? అందరికి అన్ని ప్రసాదించే దేవుడికి వీటి అవసరం అధికమా? అన్ని విధాల అష్ట దారిద్ర్యాల్ని ఎదుర్కొంటున్న అదే దేవుడు చేసిన మనుషులకు వీటి అవసరం ఎక్కువగా ఉందా? పోనీ, ఆయనే చేసిన మనుషుల కడుపులు మాడ్చి ఆయనకు పెడితే నిజంగా ఆయన సంతోషిస్తాడన్న నమ్మకం నీకుందా?

నేడు తాము దైవాంశ సంభూతలం అని, ప్రజాస్రేయోభిలాషులం అని చెప్పుకుని బ్రతికేస్తున్న బాబాలు, రాజకీయనాయకులు, బడా బాబుల దగ్గర మూల్గుతున్న నల్ల ధనం స్వాధీనం చేసుకుని, పరిశ్రమలు, పాఠశాలలు, నెలకొల్పితే ఈ దేశం ఎదుర్కొంటున్న నిరుద్యోగం, నిరక్షరాస్యత అంతం కావూ? ఇంత అనాలోచితంగా మనం ఎందుకు వ్యవహరిస్తున్నాము?

కుష్టు వ్యాధి ఎంత భయంకరమైనదో అందరికి ఎరుకే. ఎవరూ ఇంట్లోకి రానివ్వరు. అసహ్యంతోటి, భయంతోటి తనను చూసి దూరంగా జరిగిపోతారు జనులు. కండ్ల బొమ్మలు రాలిపోయి, ముక్కు సొట్టలుపోయి, పెదాలు లావెక్కుతాయి. చేతి వ్రేళ్లు రాలిపోతాయి. అలాంటి రోగులు నివసించే లెప్రాసీ హాస్పిటల్‌కు ఓరోజు నన్ను తీసుకెళ్ళాడు. వారిలో ఆహారపదార్థాలు, పళ్ళుఫలాలు పంచడమే కాక వారందరితో కలిసి ఒకే చోట కూర్చుని భోంచేద్దాం అన్నాడు. నేనైతే ఒప్పుకోలేదు. దానికి అన్నయ్య చెప్పిన మాట నేటికీ నాకు గుర్తు! **"దైవ చిత్తమయితే తప్ప ఏ వ్యాధీ అంటు వ్యాధి కాజాలదని చెప్పడమే కాక, స్వయంగా దైవ ప్రవక్త ముహమ్మద్ (స) వారితో కలిసి భోంచేశారు"** అన్నాడు. మతపరమైన అన్నయ్య విశ్వాసాలు నాకు అంతగా అంతుబట్టేవి కావు; కానీ, ఆయనలో అందరిని ప్రేమించే గుణం నాకు ఎంతో నచ్చేది.


ఒక రోజు...బహుశా అది పండగ సందర్భం అనుకుంటా. నన్ను వెంటబెట్టుకుని, రైలు డబ్బాల్లో, ఫ్లాట్‌ఫారాల మీద, గాలి వెలుతురు రాని ఇరుకిరుకు గుడిసెల్లో, మురికి కాల్వల ప్రక్కన బస్తీలలో నివసించే ప్రజల్ని సందర్శించుకుని వద్దామని బయలు దేరాడు. అప్పుడు మొదటి సారి నేనో వింత విచిత్ర నాకు తెలియని లోకాన్ని చూస్తున్నట్టనిపించింది. ఆర్థికంగా ఇంతగా దిగజారిన వ్యక్తులు కూడా ఉంటారన్న నిజమైన స్పృహ నాకారోజే కలిగింది. ఆ గుడిసెల మధ్య నడుస్తూ అన్నయ్య నాతో అన్న మాటను నేటికి, మరేనాటికి నేను మరువలేను. **'చూడు సంజయ్! రోజురోజుకు కాలం మారిపోతోంది. ప్రకృతి కూడా కొత్త శోభలతో ముస్తాబవుతున్నది. మనిషి కూడా ఆర్థికంగా, వ్యాపారంరీత్యా, ఆకాంక్షల రీత్యా మారుతున్నాడు. కానీ, భావరీత్యా అతనిలో అంతటి మార్పు కనబడటం లేదు. తాను గీసుకున్న వృత్తంలో తన కులానికి, వర్గానికి, మతానికి చోటు కల్పించుకుని మిగతా వారందరిని బైటికి గెంటేస్తున్నాడు. ఒక్క క్షణం కోసం తాను కూడా వారిలాంటి మనిషేనన్న విషయం సయితం అతినికి గుర్తుకు రావడం లేదు. సమాజానికి ఏ విధంగానూ పనికిరాని వంశ, వర్ణ, వర్గ, కుల గౌరవాల్నే సర్వస్వంగా భావిస్తున్నాడు'.**

చూడు! ప్రాణాలు కాపాడుకోవాలంటే మీ కుళ్ళిన చేయి తొలగించుకోక తప్పదని డాక్టర్ చెబితే అందుకు మనం అంగీకరిస్తున్నాము. మీ కాలు తొలగించకపోతే మీరు బ్రతకరు అని వైద్యుడు చెప్పినప్పుడు కాలుని తొలగించుకుంటున్నాము. మలినాలను బైటికి పంపేందుకుగానీ, ఆహారాన్ని లోనికి పంపేందుకుగాని మరో రంధ్రం చేయక తప్పదంటే దానికీ ఒప్పుకుంటున్నాము. గర్భ సంచి తీసేయాలంటే దానికీ తలూపుతున్నాము. ప్రాణాలను నిలుపుకునేందుకు శరీరంలోని ఏ అంగాన్ని తొలగించాలన్నా మనం వెనుకాడటం లేదు. మరలాంటప్పుడు సమాజాభివృద్ధికి, మానవాభ్యుదయానికి క్యాన్సర్‌లా మారిన కుల పిచ్చిని, వర్ణ వెర్రిని, మత మౌఢ్యాన్ని ఎందుకు వదులుకోవడం లేదు. ఎందుకు అంతగా వెనకాడుతున్నాము? ఎందుకు విముఖత చూపుతున్నాము? ఎందుకు భయపడుతున్నాము? **ఏమిటి, సాటి మనిషిని, రక్తమాంసాలున్న మనిషిని నీచునిగా, పంచమునిగా భావించడం వల్ల మనకు కలిగే లాభం ఏమిటి? ఇలా దేవుడు చేసిన వ్యక్తుల్ని కించపర్చడం అంటే దేవుణ్ణి కించపర్చినట్టు కాదా? ఆయన సృష్టిలో లోపాలు ఎంచినట్టు కాదా?** ఒక్కసారి ఆలోచించు! నేను నా ఆలోచన చెప్పాను. నీ నిర్ణయం నీది. అంతం లేని వాదనలతో ప్రతివాదనలతో ఊహాగానాలతో సమయం వృథా చేయడం సమంజసం కాదు. ఆత్మ గౌరవ భావనతో ఆలోచించు. రెచ్చిపోకుండా ఆలోచించు. మనిషిని మనిషిగా చూసి, ఇవ్వాల్సిన గౌరవం ఇచ్చేవాడు అగ్రజుడా? మనిషిని కించపర్చేవాడు ఉత్తముడా? నీవే ఆలోచించు!! ఈ ఆలోచనల్లోనే భోజనం పూర్తి చేశాడు సంజయ్.

అజయ్, ఈ మాటలు కేవలం సంజయ్‌ని ఉద్దేశ్యించి చెప్పినవి మాత్రమే కాదు. మనందరిని ఉద్దేశ్యించి చెప్పినవి. పరిపవర్తనం చెందుతామా? పాడైపోతామా? అన్నది మాత్రం మనమే నిర్ణయించుకోవాలి. ఎప్పటికైనా గెలిచేది సత్యమే. ఏనాటికైనా నెగ్గేది నిజమే. ఒక కవి ఇలా అన్నాడు:

ఏ రంగులు పులుముకున్నా
ఎప్పుడైనా గెలిచిందా చీకటి?
ఏ ఆంక్షలు నిషేధించినా
ఉదయించకుంటుందా కిరణ సంపుటి?





ముహమ్మద్ అజీజుర్రహ్మాన్

పరలోక ప్రయాణం - 2

విశ్వాసుల పరీక్ష




హష్ర్ దినము ఆఖరి ఘట్టంలో అవిశ్వాసులు తాము ప్రపంచంలో పూజించే తమ బూటకపు దైవాల పంచన చేరుతారు. వారు వీళ్ళను పశువుల మంద మాదిరిగా తోలుకుంటూ పోయి నరకంలోనికి ఈడుస్తారు. ఇక ఆ మహ్షర్ మైదానంలో విశ్వాసులు, కపటులు మాత్రమే మిగిలి ఉంటారు. అప్పుడు అల్లాహ్ అక్కడ ప్రత్యక్షమై మీరెవరి కోసం వేచి ఉన్నారు? అని అడుగుతారు. 'మేము మా నిజప్రభువైన అల్లాహ్ కోసం వేచి ఉన్నామ' ని వారు చెబుతారు. అప్పుడు అల్లాహ్ తన పిక్కను బహిర్గతం చేస్తారు. దాన్ని విశ్వాసులు (మోమిన్లు) గుర్తు పట్టగలుగుతారు. కపటులు తప్ప మిలగిలినవారంతా సాష్టాంగా ప్రణామం (సజ్దా)చేస్తారు. ఈ నేపథ్యంలో అల్లాహ్ ఇలా సెలవిస్తున్నారు:

"ఏ రోజున పిక్క విప్పబడుతుందో అప్పుడు వారు (కపటులు) సాష్టాంగా ప్రణామం (సజ్దా) కొరకు పిలువబడతారు. కాని వారు సాష్టాంగా పడలేరు".

(అల్ ఖలమ్ -42)

తరువాత ప్రజలు అల్లాహ్‌ను అనుసరిస్తారు. వారికోసం పుల్‌సిరాత్(వంతెన) పెట్టబడుతుంది. అక్కడ అల్లాహ్ విశ్వాసుల కోసం కాంతిని ప్రసాదిస్తారు. కపటులకు ఆ కాంతి ఆర్పివేయబడుతుంది.

పుల్‌సిరాత్ (వారధి)



విశ్వాసులు దాటిపోవటానికి నరకంపై ఒక వంతెన (వారధి)ఏర్పరచబడుతుంది. దాని లక్షణాలను వివరిస్తూ దైవప్రవక్త (స) ఇలా చెప్పారు: **"అది పాదరసంలా, లలిత లావణ్యంగా ఉంటుంది. దానికి సాదాన్ ముండ్ల మాదిరిగా కొక్కెలుంటాయి".** (బుఖారి)

ఆయన (స) ఇంకా ఇలా అన్నారు **"అది వెంట్రుక కన్నా పలుచగా, ఖడ్గం కన్నా పదునుగా ఉంటుంది".**

అక్కడ విశ్వాసులకు వారివారి సదాచరణను బట్టి కాంతి ప్రసాదించబడుతుంది. అన్నిటికన్నా అత్యుత్తమమైన కాంతి పర్వతానికి సమానంగా ఉంటే,అన్నిటికన్నా అధమమైన కాంతి కాలి వ్రేలిపై ఉంటుంది. ఆ కాంతి వారి కొరకు ప్రసాదించబడినప్పుడు విశ్వాసులు తమ కర్మలను బట్టి ఆ వంతెనను దాటుతారు. కొందరు రెప్ప పాటు సమయంలో దాటిపోతే మరి కొందరు విద్యుత్ వేగంతో దాటిపోతారు. కొందరు వాయు వేగంతో, మరి కొందరు పక్షి వేగంతో, ఇంకొందరు గుర్రపు పరుగు వేగంతో దాటిపోతారు.

కొందరు మామూలు వాహన వేగంతో దాటి పోతారు. కొంత మంది ఎలాంటి అడ్డంకులు లేకుండా సురక్షితంగా పుల్‌సిరాత్‌ను దాటి పోతే, మరి కొంత మంది గాయపడుతూ దాటి పోతారు. మరి కొంత మంది వంతెన దాటలేక నరకంలో కుప్పల మాదిరిగా పడిపోతారు. (ముస్లిం)

అయితే కపటులకు ఎలాంటి కాంతి భాగ్యం ప్రాప్తించదు. తత్కారణంగా వారు వంతెనను దాటలేక వెనక్కి తిరుగుతారు. మోమిన్లకు-మునాఫిఖ్‌లకు మధ్య ఒక అడ్డుగోడ ఏర్పచబడుతుంది. తర్వాత వారు వంతెనను దాటటానికి మరో ప్రయత్నం చేస్తారు.కాని అగ్నిలో పడుతూపోతారు.

నరకం




అందరికన్నా ముందు అవిశ్వాసులు (కుఫ్ఫార్) నరకానికి ఆహుతి అవుతారు. ఆ తరువాత పాపాత్ములైన ముస్లింలు, ఆ తర్వాత కపటులు నరకంలోనికి నెట్టబడతారు.నరకానికి ఏడు ద్వారాలు ఉంటాయి. నరకాగ్ని ప్రపంచంలోని అగ్ని కన్నా 70 రెట్లు వేడిగా ఉంటుంది. ఇందులో అవిశ్వాసుల అస్థిత్వం బాగా పెంచబడుతుంది. అవిశ్వాసునికి రెండు భుజాల మధ్య గల అంతరం మూడ రోజుల ప్రయాణానికి సమానంగా ఉంటుంది. అతని ఒక్కో దంతం ఉహద్ పర్వతమంత ఉంటుంది. అతని చర్మం మందం పెంచబడుతుంది. అతనికి త్రాగటానికి ఇవ్వబడే నీరు ఎంత వేడిగా ఉంటుందంటే దానివల్ల కడుపులోని ప్రేగులు తెగిపోతూ ఉంటాయి. అతనికి భోజనంగా ముళ్ళ గడ్డి, గాయాల కడుగు, చీము సమర్పించబడుతుంది. నరకంలో అత్యంత తేలికపాటి శిక్ష వైనం ఎలా ఉంటుందంటే పాదాల క్రింద రెండు నిప్పు రవ్వలు పెడితే దానివేడితో మెదడు కుత కుత ఉడికిపోతుంది.

ఇక నరకాగ్ని లోతు గురించి తెలుసుకోవాలనుకుంటున్నారా! అప్పుడే పుట్టిన శిశువును గనక అందులో పడవేస్తే, ఆ శిశువు దాని అడుగు భాగానికి చేరేసరికి 70 ఏండ్ల ప్రాయంలో ఉంటుంది. అవిశ్వాసులు, దానికి ఇంధనంగా మారతారు. దాని గాలి అత్యంత తీవ్రమైన వడగాడ్పులా ఉంటుంది. నల్లని పొగ దాని నీడ అయి ఉంటుంది. అది ప్రతి వస్తువును దహించి వేస్తుంది దేన్నీ వదలదు. దేన్నీ మిగిల్చి ఉంచదు. చర్మాన్ని మాడ్చి ఎముకల వరకూ చొచ్చుకు పోతుంది దాని సెగ హృదయాల వరకూ పోతుంది. అది ఆగ్రహంతో అరుస్తూ ఉంటుంది.

నరకవాసులు ధరించటానికి అగ్ని వస్త్రాలుంటాయి.చర్మాలు కాలిపోవటం, ముడుచుకుపోవటం, అందులో ఈడ్వబడటం, ముఖాలు మాడి నల్లని బొగ్గులా మారటం -ఇవన్నీ నరకాగ్ని యాతనలో వివిధ రకాలు.

చిన్న వంతెన (ఖంతరా)



దైవప్రవక్త(స) ఇలా ప్రవచించారు: "విశ్వాసులకు నరకం నుండి విముక్తి లభించిన మీదట స్వర్గానికి-నరకానికి మధ్య ఒక చిన్న వారధి పై వారిని నిలువరించటం జరుగుతుంది. ప్రపంచంలో వారు ఒండొకరిపై చేసిన దౌర్జన్యాల ప్రతీకారం అక్కడ తీర్చుకోబడుతుంది. ఆ విధంగా వారు పూర్తిగా పవిత్రులైన మీదట స్వర్గ ప్రవేశానికి అర్హత సంపాదిస్తారు. ఎవరి అధీనంలో ముహమ్మద్(స) ప్రాణముందో ఆ శక్తిమంతుని సాక్షి! స్వర్గంలో స్వర్గవాసి తమ గమ్యస్థాన మార్గాన్ని ప్రపంచ గమ్యస్థానం కన్నా బాగా గుర్తెరిగి ఉంటాడు."

స్వర్గం



స్వర్గం మోమిన్ల(విశ్వాసుల) నివాస స్థలం. దాని ఇటుకలు వెండీ బంగారాలతో చేయబడినవై ఉంటాయి. దాని గార కస్తూరి అయి ఉంటుంది. దాని రాళ్లు ముత్యాలు, పగడాలతో చేయబడినవి. దాని మట్టి కుంకుమ పువ్వు వలె ఉంటుంది. స్వర్గానికి ఎనిమిది ద్వారాలుంటాయి. ఒక్కో ద్వారం వెడల్పు మూడు రోజుల ప్రయాణ దూరానికి సమానంగా ఉంటుంది. అయినప్పటికీ అది స్వర్గవాసుల రాకతో కిటకిటలాడుతూ ఉంటుంది. అందులో 100 అంతస్తులుంటాయి. ఒక అంతస్తుకు-మరో అంతస్తుకు మధ్య గల దూరం భామ్యాకాశాల మధ్య ఉన్నంతగా ఉంటుంది. దైవసింహాసనం (అర్ష్) దాని కప్పుగా ఉంటుంది. దాని కాలువలు పైపైనే ప్రవహిస్తుంటాయి. స్వర్గవాసులు తాము కోరిన చోటికి వాటి పాయలను తీసుకుపోగలరు. అవి పాల కాలువలు, తేనె కాలువలు, నీటికాలువలు, మధు కాలువలు అయి ఉంటాయి. స్వర్గంలో వృక్షాలకు పండ్లు నిత్యం వ్రేలాడుతూ, చాలా దగ్గరగా అందుబాటులో ఉంటాయి. స్వర్గంలో ఓ విశిష్ఠమైన ముత్యాల గుడారం స్వర్గవాసి ఇంటివారలు విడిది చేసి ఉంటారు. స్వర్గవాసులు శరీరంపై రోమాలు ఉండవు. వారి కళ్లు ప్రకాశమానంగా ఉంటాయి. వారి యవ్వనం తరగదు. వారి దుస్తులు మాసి పోవటం ఉండదు. స్వర్గంలో మలమూత్ర విసర్జన ఉండదు. అక్కట మరే విధమైన అశుద్ధత కూడా ఉం డదు. వారి దువ్వెనలు బంగారు దువ్వెనలు, వారికి పట్టే చెమట కస్తూరి పరిమళాన్ని గుభాళిస్తుంది. వారి భార్యలు సిగ్గు లొలికే సుందరాంగులై ఉంటారు. సమ వయస్కులై ఉంటారు. భర్తలకు ప్రియాతి ప్రియమైన వారై ఉంటారు. స్వర్గంలో అందరి కన్నా ముందు ముహమ్మద్ ప్రవక్త(స) ఆ తరువాత ఇతర ప్రవక్తలు ప్రవేశిస్తారు.

స్వర్గంలో అధమాతి అధమ శ్రేణిలో ఉన్న స్వర్గవాసి కూడా ఏదన్నా కోరితే కోరిన దాని కంటే పది రెట్లు ఎక్కువ ఇవ్వబడుతుంది. ఇక స్వర్గవాసుల సేవలో ఉండే అందమైన బాలురు ఎప్పుడూ బాలురుగానే ఉంటారు. చూడబోతే వారు అందమైన చెదరిన ముత్యాలను తలపిస్తుంటారు. స్వర్గంలోని ఈ అనుగ్రహాలన్నీ ఒక ఎత్తయితే దైవ దర్శన భాగ్యం మరో ఎత్తు. స్వర్గ వాసులకు అల్లాహ్ దర్శన భాగ్యం లభిస్తుంది. అల్లాహ్ వారి పట్ల ప్రసన్నుడవుతాడు. స్వర్గ నివాసం శాశ్వితమైనది.

ఖుర్ఆన్‌లో ఇలా ఉంది:

"నిశ్చయంగా విశ్వాసులు సాఫల్యం పొందుతారు. వారు ఎలాంటి వారంటే, తమ నమాజులో వారు అణకువ, తాదాత్మ్యం కలిగి ఉంటారు. వారు పనికి మాలిన వాటి జోలికి పోరు. వారు (తమపై విధించబడిన) జకాతు విధానాన్ని పాటిస్తారు. వారు తమ మర్మస్థానాలను కాపాడుకుంటారు.....వారు తమ అప్పగింతల, వాగ్దానాల పట్ల కడు అప్రమత్తంగా ఉంటారు. వారు తమ నమాజులను కాపాడుకుంటూ ఉంటారు. ఇలాంటి వారే అసలు వారసులు. (స్వర్గంలో శిఖర భాగమైన) ఫిర్‌దౌసు ప్రదేశానికి వారు వారసులవుతారు. వారక్కడ కలకాలం ఉంటారు". (మోమినూన్: 1-11)

సయ్యద్ అబ్దుస్సలాం ఉమ్రీ
abdussalamsyed@ymail.com

అనురాగ రావం


కారుణ్యమూర్తి కంట కన్నీరొలకిన వేళ

"వారి ముందు కరుణామయుని సూక్తులు పఠిస్తుంటే వారు కన్నీటి ధారలతో (దేవుని సన్నిధిలో) సాష్టాంగ పడుతుండేవారు". (మర్యం: 58)

మహా ప్రవక్త ముహమ్మద్ (స) సహృదయులు, జాలి గుండె గల వారు. ఒకసారి ఆయన (స) ఇబ్నె మస్ఊద్‌తో "మస్ఊద్! నాకు ఖుర్ఆన్ చదివి విన్పించు' అని కోరారు. దానికి ఇబ్నె మస్ఊద్ (ర) 'దైవ ప్రవక్తా! ఖుర్ఆన్ అవతరిచింది మీపైనై కదా! అలాంటప్పుడు మీకు నేను ఖుర్ఆన్ చదివి విన్పించడమేంటి?' అని ఆశ్చర్యపోతూ అడిగారు. 'నాకు ఇతరుల ద్వారా ఖుర్ఆన్ పారాయణం వినడం అంటే మిక్కిలి ఇష్టం' అని అన్నారాయన (స). ఇబ్నె మస్ఊద్ (ర) అప్పుడు 'నిసా' సూరా పారాయణం చేయటం మొదలెట్టారు. అలా పారాయణం చేస్తూ – **"మేము ప్రతి అనుచర సమాజం నుండి ఒక సాక్షిని తెచ్చి నిన్ను (ప్రవక్త ముహమ్మద్‌ను) వారందరికీ సాక్షిగా నిలబెట్టి నప్పుడు వీరి పరిస్థితి ఏమవుతుంది?"** అనే సూక్తి దగ్గరికి చేరుకోగానే 'ఇక చాలు ఆపెయ్యి' అన్నారాయన (స). ఇబ్నె మస్ఊద్ (ర) తల పైకెత్తి చూస్తే ఆయన కళ్ళ నుండి కన్నీళ్ళు ధారాపాతంగా ప్రవహిస్తున్నాయి. (బుఖారీ)

ఓసారి ఒక సహచరుడు కారుణ్యమూర్తి (స) వారి సమక్షంలో తన అజ్ఞాన కాలం నాటి బాధాకరమైన సంఘటనను విన్పించారు. "నాకు ఒక చిన్న పాప ఉండేది. మా ప్రాంతంలో లేని పౌరుషానికి పోయి, పుట్టగానే ఆడ శిశువులను చంపే ఆచారం ఉండేది. నా భార్య నాకు తెలియకుండానే నా కూతుర్ని పెంచి పెద్ద చేసింది. ఆ పసిపాప చిలిపి చేష్టలు నన్ను మంత్రముగ్ధుణ్ణి చేసేవి. అలా నేను ఆ పాపను ప్రేమించనారంభించాను. ఇది గమనించిన నా భార్య ఫర్వాలేదులే అనుకొని 'తను నా కూతురే' అన్న రహస్యం బైట పెట్టింది. మరుక్షణమే నాలోని మృగం మేల్కొంది. నేను అదను చూసి పాపను తీసుకొని స్మశానానికి బయలుదేరాను. 'నాన్నా! మనం ఎక్కడికి వెళుతు న్నాము?' అని తను పదే పదే ప్రశ్నిస్తున్నా అవేవి వినే స్థితిలో లేని నేను నేరుగా ఖనన వాటకకు చేరుకున్నాను.

పాపను ఓ ప్రక్క కూర్చోమని చెప్పి 'సమాధి' తవ్వడం మొదలెట్టాను. నాపై పడే మట్టిని ఆ చిన్నారి పాప తన చిట్టి చేతులతో శుభ్రం చేస్తూ 'ఎందుకు నాన్నా గుంత తవ్వుతున్నావు?' అని ఒకే ప్రశ్న మరీ మరీ అడుగుతోంది. నేను మాత్రం మానవత్వం మరచిన మృగాన్నయి, పితృ వాత్సల్యం మరచిన పశువునై ఎలాంటి సమాధానం ఇవ్వకుండా నా పని నేను పశువునై నా పని నేను చేసుకుపోతున్నాను. గుంత తవ్వటం పూర్తయింది.



నా శరీరంపై చోటు చేసుకున్న చెమట బిందువుల్ని తన బుల్లి బుల్లి చేతులతో తుడుస్తున్న ఆ చిట్టతల్లిని ఒక్కసారి పట్టి గుంతలో నెట్టేశాను. 'పాపం! తనకేమి తెలుసు కన్న తండ్రే తన్ను కడతేర్చేందుకు కసాయి వాడయ్యాడు' అని. బిత్తర చూపులతో..... నా వంకే.......కాసేపు.....చూస్తుండి.....పోయింది!!

అయినా నాకు జాలి కలగలేదు, ఆ చిట్టి తల్లిని అలానే ఉంచి ఆమెపై మన్ను త్రోయడం మొదలెట్టేశాను. ఆ పసిడి నవ్వు పాపాయి 'నాన్నా!' అన్ని దిక్కులు పిక్కటిల్లేలా పెడబొబ్బ లు పెడుతున్నా, ఆ బుజ్జి కళ్ళు కన్నీరు కారుస్తున్నా కనికరించక క్రూర పశువునై ఆ చిట్ట తల్లిపై మట్టి గడ్డలు వేస్తూనే ఉన్నాను. ఆ క్షణంలో ఉన్మాదిలా మారిన నేను నా చిట్టి తల్లితోపాటు 'నాన్నా! కాపాడు...నాకు భయమే స్తోంది...శ్వాస ఆడటం కష్టమవుతోంది...ఇక మీదట నేనే తప్పు చెయ్యను....ప్రామిస్...' అన్న ఆమె ఆర్తనాదాన్ని సయితం సజీవ సమాధి చేసేశాను. కాస్త కాస్త కన్నకూతురిని కాటి మట్టిలో కలిపేశాను.

నిరాక్షిణ్యమైన ఈ గాథను విని కారుణ్యమూర్తి (స) కళ్ళల్లోని అశ్రుజలధి కట్టలు తెంచుకుని ప్రవహించసాగింది. హృదయ విదారకమైన, గుండెల్ని పిండేసే ఆ వృత్తాంతాన్ని విన్న కారుణ్యమూర్తి (స) ఎక్కి ఎక్కి ఏడ్వసాగారు. ఆయన గడ్డం మొత్తం తడిసి ముద్దయింది". (ముస్నద్ దారమీ)

ముస్అబ్ బిన్‌ఉమైర్ (ర) అనే ఒక సహాబీ ఉండేవారు. ఇస్లాం స్వీకారానికి పూర్వం నూనూగు మీసాల ఆ యువకుడు సిరి సంపదల్లో తులతూగాడు. ఒకసారి తొడిగిన దుస్తులు మళ్ళి తొడగకుండా ఎంతో గారాబంగా పెరిగాడు. అతను సువాసన పూసుకుని ఏదైనా వీధి గుండా వెళితే ఆ సుగంధ పరిమళాలతో వీధి మొత్తం గుభాళించేది. అతని తల్లిదండ్రులు అతన్ని అత్యంత ఖరీదైన దుస్తులు తొడిగించేవారు.

అల్లాహ్ అతనికి ఇస్లాం స్వీకరించే భాగ్యాన్ని ప్రసాదించాడు. తను ముస్లిం అయ్యాడు. కన్నకొడుకు తాతముత్తాల మతాన్ని విడిచి పెట్టినందుకుగాను తల్లిదండ్రులు నిప్పులు చెరిగారు. ఎంత ప్రేమగాపెంచారో దానికన్నా ఎక్కువగా ద్వేషించడం మొదలెట్టారు. సత్య ధర్మమైన ఇస్లాం కోసం సర్వాన్ని త్యాగం చేసిన ఆ నవ యువకుడు ఒకసారి కారుణ్యమూర్తి (స) సన్నిధికి వచ్చాడు. అప్పుడు అతని పరిస్థితి ఎలా ఉందంటే, అత్యంత ఖరీదైన బట్టలతో నిత్యం కళకళలాడుతూ ఉండే తన ఒంటిపై అతుకులు వేయబడిన దుస్తులు, గుండీలకి బదులు ముళ్ళు గుచ్చుకున్న బట్టలున్నాయి. ఆ నవ యువకుని ఆ పరిస్థితిని చూసి కారుణ్యమూర్తి (స) వారి కళ్ళల్లో కన్నీరు ఉబికి వచ్చింది.

ఓసారి కొంత మంది, చివరి శ్వాసలు లెక్కిస్తున్న జైనబ్ (ర) గారి పసి పిల్లాడిని ఎత్తుకొని కారుణ్యమూర్తి (స) వారి ముందు తెచ్చారు. పిల్లవాడు చావుబ్రతుకుల మధ్య కొట్టుమిట్టాడుతున్నాడు. ఆ బాబుని ఒళ్ళో తీసుకున్న కారుణ్యమూర్తి (స) వారి కళ్ళు అశ్రుపూరితాలయ్యాయి. అక్కడున్న హజ్రత్ సాద్ (ర)కు ఆశ్చర్యమేసి–"ఓ దైవప్రవక్తా! ఏమిటిదీ? తమరు కంటతడి పెట్టడమా?' అని అననే అన్నారు. దానికి కారుణ్యమూర్తి (స) "ఇతరులపై జాలి చూపే వారిపైనే దేవుడు జాలి చూపుతాడు" అని రుద్ధ కంఠంతో జవాబిచ్చారు. (బుఖారీ)

కారుణ్యమూర్తి (స) వారికి ఖురైషు ప్రజలు ఎక్కడ ముప్పు తల పెడతారోనన్న భయంతో ఓరోజు బాబాయి అబూతాలిబ్ ఆయన్ను ఉద్దేశ్యించి – "ముహమ్మద్! నీ బాబాయిని చూసి అయినా జాలి పడవయ్యా! నేను మోయలేని భారం నాపై మోపకు బాబూ!!" అన్నారాయన ఆవేదనాభరిత కంఠంతో. అదొక సున్నితమైన ఘడియ. కాలం స్తంభించిపోయి కారుణ్యమూర్తి (స) వారి సమాధానంకై ఉత్కంఠతో ఎదురు చూస్తోంది.

ప్రవక్త (స) వారు పెదవి విప్పారు. **"బాబాయి! దైవసాక్షి! వీరు నా కుడి చేతిలో సూర్యుణ్ణి, నా ఎడమ చేతిలో చంద్రుణ్ణి తెచ్చి పెట్టి ఈ మహాకార్యం మానుకోమన్నా అది జరిగే పని కాదు. వినండి! ఈ మహా కార్యం పూర్తయినా పూర్తి అవ్వాలి. లేదా ఈ మార్గంలో నా ప్రాణాలైనా పోవాలి"** అన్నారు దృఢ సంకల్పంతో.

కారుణ్యమూర్తి (స) లేచి బయటికి నడిచారు. ఆయన కళ్లల్లో నీళ్లు సుడులు తిరిగాయి. అది గమనించిన బాబాయి 'అబ్బాయి! నీవు చెప్పదలచుకున్నది నిర్భయంగా చెప్పు. నా బొందిలో ప్రాణం ఉన్నంత వరకూ నేను నీతోనే ఉంటాను' అన్నారు అబూతాలిబ్. అది విన్న కారుణ్యమూర్తి ముఖారవిందం పువ్వులా వికసించింది.

ముహమ్మద్ ఖాన్

కవితా కుసుమాలు

మీ అడుగుజాడల్లోనే మేమూ...

మనోహరమైన మక్కా సీమలో, పవిత్ర
విమల తేజోమయ విశాల వీధిలో
అక్షరం ఎరుగని నిరక్షరాసులై దైవ
దౌత్య ముగింపుగా అరుదెంచారు మీరు
పూర్ణ వికసిత సత్యధర్మ శాంతి
సౌరభాలను సర్వత్రా జల్లారు మీరు

నాడు మీరు అందించిన దీ వసంత
మధుర జీవన గీతి! వహీ, దివ్యావిష్కృతి!!
నేడు కూడా విశ్వమంతటి విశ్వాసుల
వినిర్మల హృదయ దీపికై వెలుగుతున్నది
అంధకార అమావాస్య తమస్సులను తొలగిస్తున్నది
కాంతి సీమల్లో కరుణామృతాలు చల్లుతున్నది

నాడు మృదు మధుర మీ అధరాల సంకీర్తనం
పవిత్ర గ్రంథ పారాయణం వినబడినప్పుడు మీ
సప్త స్వర సుమనోజ్ఞ సుందర సంస్మరణలను
భువన గగనాలు, దివి సీమ దూతలు తమ
శ్రవణాలు విచ్చి, తాదాత్మ్యం చెందుతూ విన్నారు
సుగుణ మాణిక్య సుభక్తాగ్రేసరులు మీరు; మీ
సహచరులు మిలమిల మెరిసే తారకలై మీ సుమ్మృదు
సుభాషితాలను సర్వవ్యాప్తం చేశారు.
వారి బాటలోనే మేమూ...

కలిసుంటే కలదు సౌఖ్యం

అబుల్ హసన్

ఐక్యం అదీ మనందరికి ముఖ్యం
అందులోనే ఉంది అసలు సౌఖ్యం
లేనిపోని చీలికలు, రెండు రెండు నాలికలు
ఇవే మన అవస్తలన్నింటికి కారకాలు
ఐక్యంతో సాగితే సత్యవస్థ
అప్పుడుండదు మనకీ అవస్థ

కాదు ఔను అవును కాదు
లేదు అవదు అనేకం అయితే
ఏకం అదే వివేకం!
ఏకం ఏవం ద్వితీయం నాస్తే
అదే పరమ సత్యం!!

ఐక్యం అన్నింటికీ మూలం
అటే కదుల్తోంది కాలం
ధర్మోన్నతి, ధర్మనీతి మనందరి లక్ష్యం
దైవప్రీతి, స్వర్గప్రాప్తి మన ఆశయం


ఐక్యం ఎప్పుడో కాదిప్పుడే
ఎక్కడో కాదు అదిక్కడే
మాట చేతగా మారి మనిషి
మనిషితో చేరి లక్ష్యం సాధిస్తేనే
స్వర్గం
లేదా–
అందుకోండి దైవ సందేశం
వ్యక్తి బహువచనం శక్తి
వేరైపోతే తప్పదు దుర్గతి!

"మీరందరూ అల్లాహ్‌కు, ఆయన ప్రవక్తకూ విధేయులై ఉండండి. పరస్పరం గొడవ పడకండి. (కయ్యానికి కాలు దువ్వితే) మీరు పిరికివారై పోతారు. (మీలోని సమైక్యత సన్నగిల్లుతుంది.) మీలోని మనో నిబ్బరం నీరుగారిపోతుంది. అందుకే సహనస్థయిర్యాలను పాటించండి. స్థయిర్యం కనబరిచే వారికి ఖచ్చితంగా అల్లాహ్ తోడు లభిస్తుంది". (అన్‌ఫాల్: 46)

ప్రశ్నగా మిగిలిన ప్రశ్న

షేఖ్ ముహమ్మద్ సలీమ్ జామయీ

ఎవరు బాధ్యులు..?



అది అల్‌జజాయిర్ రాజధానిలోని సముద్ర తీరానున్న ఫైవ్‌స్టార్ హోటలు. ఆ రోజు వాతావరణం చాలా అహ్లాదకరంగా ఉంది. దూరం నుండి ఆకాశం మీద కనిపిస్తున్న మేఘాల కదలిక మరియు ఎదుటే వున్న సముద్రపు అలల అలజడి ఫైవ్‌స్టార్ హోటల్లో బసచేసి వున్న వారికి కనువిందు చేస్తున్నాయి.

ఓ ప్రముఖ వ్యాయపారి ఆ హోటల్లో తన గది ఆవరణంలో కూర్చోని ఆహ్లాదకరమైన వాతావరణాన్ని ఆస్వాదిస్తూ దీర్ఘంగా ఏదో ఆలోచిస్తున్నాడు. అతను వ్యాపార వ్యవహారాలు నిమిత్తం ఈ దేశానికి వచ్చినప్పుడల్లా ఇదే హోటల్లో బస చేయడం అతని అలవాటు. ఇంతకు పూర్వం అనేకమార్లు ఇక్కడ కూర్చొని తన బిజినెస్ మెరుగుపరచుకోవటానికి సన్నాహాలు చేసే అతను ఈ సారి మాత్రం అందుకు భిన్నంగా తన కంటికి కనిపిస్తున్న దృశ్యాలను చూచి వాటిని తన గత జీవితంతో పోల్చుకుంటున్నాడు.

ఉదాహరణకు: ఆకాశంలో ప్రయాణిస్తున్న మేఘాలను చూచి నేను కూడా ఈ మేఘాల లాగే ఎప్పుడూ విరామం లేకుండా ప్రపంచ నలుమూలలలోని వివిధ దేశాలకు ప్రయాణాలు చేస్తూ వుంటాను. ప్రస్తుతం నేను ఒక గొప్ప వ్యాపారవేత్తను. నేను ప్రపంచంలోని ధనికులలో ఒకడినయ్యాను. నేను ఈ స్థాయికి చేరటానికి ఎంతో శ్రమించాను. నేను నా కుటుంబ సభ్యులతో గడిపిన సమయం కంటే ఫైవ్‌స్టార్ హోటల్లలో గడిపిన సమయం ఎన్నోరెట్లు అధికం. ఇలా ఆలోచించుకుంటూ అక్కడి నుండి లేచి తన గదిలోని అద్దం ముందరకెళ్ళి నిలబడ్డాడు. వెంట్రుకలు రాలిన బట్టతల, తెల్లబడిపోయిన మిగిలిన వెంట్రుకలు, మడతలు పడ్డ చర్మము చూచే సరికి మళ్ళీ ఆలోచనలు సుడులు తిరిగాయి.

నా యవ్వనం మొత్తం డబ్బు సంపాదించటంలోనే గడిచిపోయింది, నేను సమయాన్ని వృద్ధా చేయకుండా బాగా ధనం సంపాదించాను. నాకు ఒక అందమైన భార్య వుంది. నా తరువాత నా వ్యాపార వ్యవహారాలన్నీ చూచుకోవటానికి నాకు ఏకైక వారసుడు కూడా వున్నాడు. ప్రస్తుతం అతని వయస్సు ఇరవైకి ఇంచు మించు వుంటుంది. అతను ఇంజనీరింగ్ చదువుతున్నాడు. ఇంజనీరింగ్ ఏ సంవత్సరం చదువుతున్నదీ స్పష్టంగా తెలియదు. బిజినెస్ గొడవలో పడి అతని చదువు ఎలా వుందన్న విషయాన్ని పట్టించుకో లేకపోయాను. ఈ సారి నేను స్వదేశానికి వెళ్తే నాకు రిసీవ్ చేసుకోవటానికి అతను విమానాశ్రయానికి వస్తాడు. అప్పుడు అతనితో వివరాలన్నీ అడిగి తెలుసుకుంటాను. ఆ తరువాత కొద్ది రోజులు గడిచాక నా వ్యాపార వ్యవహారాలన్నీ అతనికి అప్పగించి నేను విశ్రాంతి తీసుకుంటాను. వగైరా...వగైరా..ఇలాంటి కలల లోకంలో అతను వుండగా గదిలోని ఫోన్ మోగింది. అతను ఆ కలల లోకం నుంచి బైటపడి కాల్ రిసీవ్ చేశాడు, మామూలుకు భిన్నంగా అతని స్వదేశం నుండి అతని అన్నయ్య మాట్లాడుతున్నాడు. తమ్ముడూ! వెంటనే ఇంటికి బయలుదేరి వచ్చేయ్, నీ భార్య ప్రాణపాయ స్థితిలో వుంది. ఆలస్యం చేయకు, లేదంటే కడచూపు కూడా దక్కకపోవచ్చు..ఆ...ఆ...వ్యాధి ఏమీ లేదు. ఆక్సిడెంట్ జరిగింది...నీవు వెంటనే వచ్చేయ్..... ఒక్క సారిగా ఆ వ్యాపారవేత్త మైండ్ బ్లాక్ అయినట్లనిపించింది. కంగారు కంగారుగా వణుకుతున్న పెదవులతో మాట్లాడాడు....

"ఆవిడకి వెంటనే విమానంలో యూరప్ దేశాలకు తరలించి చికిత్స చేయించండి, నా సంపాదన మొత్తం ఖర్చు అయినా పరవాలేదు ఆవిడ మాత్రం బ్రతకాలి" అన్నాడు. అతని మాటలకు అతని అన్నయ్య స్పందిస్తూ "ఇక్కడి డాక్టర్లు యూరప్ డాక్టర్లకి ఏమీ తీసిపోరు. ఇక్కడే చికిత్స మెరుగ్గా జరుగుతోంది, నీవు మాత్రం తక్షణమే ఇంటికి బయలు దేరమన్నాడు అన్నయ్య.

మరి కొన్ని గంటల్లోనే అతని దేశానికి వెళ్ళే విమానముంది. వ్యాపారి తక్షణమే అక్కడి నుండి బయలుదేరి విమానము ద్వారా స్వదేశ విమానశ్రయానికి చేరగా అతని అన్నయ్య అతని కోసం ఎదురు చూస్తున్నాడు. బిజినెస్‌లో పడి చాలా రోజుల నుండి అన్నయ్యకు దూరంగా ఉంటున్నాడు తమ్ముడు. తన ఏకైక అన్నయ్యకి కలిసి మాట్లాడే తీరిక కూడా అతనికి వుండేది కాదు. చాలా రోజుల తరువాత ఇలాంటి పరిస్థితిలో అన్నయ్యకు కలవాల్సి వచ్చింది. వచ్చి రాగానే అన్నయ్యను పలకరిస్తూ నా భార్య పరిస్థితి ఇప్పుడెలా వుందని ప్రశ్నించాడు?

తీవ్రమైన గాయాల కారణంగా నీ భార్య మరణించిందని అన్నయ్య తడబడుతూ సమాధానమిచ్చాడు. ఇక ఆ వ్యాపారి తన దుఖాన్ని ఆపుకోలేకపోయాడు. ఏడ్వటం మొదలెట్టాడు. చాలాసేపు వరకు అతను ఏడుస్తూనే ఉన్నాడు. కాసేపు తరువాత తన్నుకొస్తున్న దుఃఖాన్ని ఆపుకోవటానికి విఫల ప్రయత్నం చేస్తూ ఎలా జరిగింది? ఇప్పుడావిడ మృతదేహం ఎక్కడుంది? అని అన్నయ్యను అడిగాడు. అనుకోకుండా ఈ ప్రమాదం జరిగింది. అందులోనే ఆవిడ ప్రాణాలు కోల్పోయింది, ప్రస్తుతం ఆవిడకి పోస్టుమార్టం జరుగుతున్నది. బహుశా రేపు అంత్యక్రియలు జరగవచ్చని అన్నయ్య తెలిపాడు.

సరే మరి నా కుమారుడు ఎక్కడున్నాడు? నా కోసం అతను విమానాశ్రయానికి ఎందుకు రాలేదు? అతని ఈ ప్రవర్తన నాకు నచ్చ లేదు అన్నాడు తమ్ముడు (వ్యాపారి). సరేసరే... పదా బయలు దేరుదామని అన్నయ్య సోదరునికి తన కారులో కూర్చోబెట్టుకొని ఇంటికి బయలుదేరాడు, వ్యాపారి కారులో కూర్చొని గత జీవితంలో తన భార్యతో గడిపిన మధుర క్షణాలు గుర్తు తెచ్చుకోసాగాడు.

ఆవిడతో జీవితం పంచుకున్న 20 సంవత్సరాలలో ఆవిడ ఎప్పుడూ అతనికి ఎదురు మాట్లాడలేదు. కనీసం ఈరోజు ఎందుకు ఆలస్యంగా వచ్చారని నిలదీసే తత్వం కాదావిడది. ఆవిడ గ్రంథజ్ఞానం కలిగిన ఒక భక్తురాలు. అల్లాహ్ ఆదేశాలు మరియు ప్రవక్త ముహమ్మద్(స) సున్నత్‌ల ప్రకారం జీవితాన్ని గడిపేది. మరి నేను మాత్రం సమయం మొత్తం ధన సంపాదనలోనే గడిపేసాను. నాపై ఉన్న ఆవిడ హక్కుల్ని కూడా సరిగ్గా తీర్చలేక పోయానని మధన పడుతూ కన్నీరు మున్నీరయ్యాడు.

మరో వైపు కారు నడుపుతున్న అతని అన్నయ్య అసలు సంగతి తమ్ముడికి ఎలా చెప్పాలి? వాస్తవానికి ఆవిడ మరణం ఎలా సంభవించిందన్న విషయం తమ్ముడికి ఎలా తెలపాలని తీవ్రంగా ఆలోచించి ఒక నిర్ణయం తీసుకొని బండిని తన స్వగృహం వైపు మళ్ళించాడు.

బండి మరోదారి నుండి వెళ్ళటం గమనించి ఎక్కడికి వెళ్తున్నావ్, నా ఇంటి దారి ఇటువైపు కాదు కదా? అని వ్యాపారి ప్రశ్నించాడు. ముందు నా ఇంటికి పదా ... నీతో ఒక ముఖ్యమైన విషయం మాట్లాడాలని అన్నయ్య చెప్పాడు.

ఇంటికి చేరగానే అన్నా తమ్ములిద్దరూ ఇంట్లోకి ప్రవేశించారు. అన్నయ్యది ఒక సాధారణమైన ఇల్లు. అతను ఒక కంపెనీలో అకౌంటెంట్‌గా పని చేస్తూ కుటుంబ సభ్యులతో సంతోషంగా జీవితం సాగిస్తున్నాడు. మిలియనీర్ అయిపోవాలన్న ఆశ అతనికి లేదు. అతని కుటుంబ సభ్యులందరూ అతనిలాగే దైవభక్తితో జీవితం గడుపుతున్నారు. ఇదే నగరంలో అన్నయ్య నివసిస్తున్నా తను ఏ ఒక్క రోజు కూడా అన్నయ్య ఇంటికి వచ్చి పలకరించనందుకు సిగ్గు పడ్డాడు వ్యాపారి తమ్ముడు. తరువాత అన్నయ్య తమ్ముడికి ఓ చోట ప్రశాంతంగా కూర్చోబెట్టి నేను ఇప్పుడు చెప్పే మాటలు కాస్త మనసు నిబ్బరం చేసుకొని విను అని అసలు విషయం వివరించడం మొదలు పెట్టాడు అన్నయ్య. నేను ఆ రోజు ఆఫీసు నుండి ఇంటికి వచ్చాను, అంతలోనే పోలిస్ స్టేషన్ నుండి నాకు ఫోన్ వచ్చింది, మీరు వెంటనే స్టేషన్‌కి హాజరు కావాలని చెప్పేసరికి నేను కంగారుగా స్టేషన్ చేరుకున్నాను. అక్కడ నీ కుమారుడు రక్తపు మరకలతో చిరిగి పోయిన బట్టలతో గది మూలన కూర్చోని ఉన్నాడు, నన్ను చూడగానే కాళ్ళు ఈడ్చుకుంటూ నా దగ్గరకు వచ్చి నన్ను హత్తుకొని బోరున విలపించాడు. ఏమైంది బాబు అని అడిగితే సమాధానమివ్వకుండా ఎక్కి ఎక్కి ఏడుస్తున్నాడు. నాలు గైదుసార్లు అడిగినా ఫలితం లేకపోయింది. చివరకు నేను అతనికి వదలి పోలీసు లతో ఏమిటి సమస్య అని అడగ్గా వారు ఇచ్చిన సమాధానంతో నేను షాక్కయ్యాను.



'ఈ అబ్బాయి మత్తు పదార్థాలను సేవిస్తున్నాడు, అదే మైకంలో తన తల్లిని హతమార్చి స్టేషన్‌కి వచ్చి లొంగిపోయాడు. అతనికి తనఖీ చేయగా అతని జేబులో హెరాయిన్ లభ్యమైంది'. తరువాత పోలీసులు ఘటనా స్థలానికి చేరి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. బహుశా రేపు ఆవిడ అంత్యక్రియలు చేయటానికి వీలు కుదరవచ్చని అన్నయ్య వాస్తవం తెలుపగా..... వ్యాపారవేత్త బాధ రెట్టింపయింది. అయ్యో నేను నాశనం అయిపోయానే! అని తల పట్టుకొని రోధించసాగాడు. ఆ స్థితిలోనే తల్లిని చంపాల్సిన అవసరం అతనికి ఏమొచ్చింది? ఎందుకతను ఇంతటి పాపానికి పాల్పడ్డాడని ప్రశ్నించాడు. ఇంకా వివరాలు ఎవరికీ తెలియవు... ఇది మిష్టరీగానే మిగిలి పోయి వుందని అన్నయ్య అన్నాడు.

మరుసటి రోజు మృతదేహం ఇంటికి చేరగా జనాజా కార్యక్రమాలు పూర్తి చేయబడ్డాయి. భార్యాబిడ్డల గురించి పట్టించుకోకుండా డబ్బు బిజినెస్ వైపే పూర్తి దృష్టి సారించిన మిలియనీర్ తన సతీమణి మృతదేహాన్ని తన స్వహస్తాలతో మట్టిలో కలిపేసి స్మశానం నుండి ఇంటికి తిరిగి వచ్చాడు.

అతని మెదడులో తిరుగుతున్నది ఒకే ఒక్క ప్రశ్న–ఎందుకు నా కుమారుడు ఈ అఘాయిత్యానికి పాల్పడ్డాడు? ఈ హత్య వెనుక ఉన్న అసలు కారణమేంటి?

ఆ రోజు వార్తా ఛానల్లలో ఓ వార్త హాట్ టాపిక్‌గా మారింది, ఒక యువకుడు తన కన్న తల్లిని హతమార్చాడు. హంతుకుడు ప్రపంచంలోనే పేరు ప్రతిష్టగల గొప్ప వ్యాపారి కుటుంబానికి సంబంధించినవాడు. హంతకుడు నిషేధిత డ్రగ్స్‌కు అలవాటు పడిన కారణంగా గత సంవత్సరం కాలేజినుండి గెంటివేయబడ్డాడు. హంతకుడిని పోలీసులు అదుపులో తీసుకొని విచారణ జరుపుతున్నారు.... వగైరా.

ఈ వార్తలు వ్యాపారవేత్త దృష్టిలో కూడా పడ్డాయి. అతను ఏకాంతంలో కూర్చోని... నీ కుమారుడు కాలేజి నుండి గెంటివేయబడ్డాడు కానీ, నీకు తెలియదు. నీ కుమారుడు మత్తు పదార్థాలకు బానిసయ్యాడు కానీ, నీకు తెలియదు. ఏమి తండ్రివిరా నీవు? నీ దగ్గర హాయిగా జీవితం గడపటానికి సరిపడా ధనం ఉన్నా, సంపాదనలో డబ్బు విషయంలో నేను ఇతరులను మించిపోవాలనే మత్తులో మునిగి పోయావు. అనుకున్నట్టే నీ దగ్గర ఇతరులకు మించిన సంపాదన వచ్చింది. కాని ఏం లాభం? నీ కుటుంబ సభ్యులు నీకు దూరమయ్యారు. నీవు కూడబెట్టిన ఈ సంపాదన మొత్తం ఖర్చుచేసి కోల్పోయిన వారిని తిరిగి పొంద గలవా? ఎంతటి దౌర్భాగ్యుడివిరా నీవు అంటూ తన్ను తాను నిందించుకో సాగాడు.

ఈ విషయాన్ని తెలుసుకోవటానికి అన్యయ్యతో కలిసి కుమారుడు ఖైదీగా ఉన్న పోలిస్ స్టేషన్‌కి చేరుకున్నాడు వ్యాపారి..... కానిస్టేబుల్ సెల్ బీగం తెరవగా తండ్రి కొడుకులిద్దరూ గదిలో కూర్చున్నారు. ఎవరు ముందుగా పలకరించాలో ఏ విధంగా పలకరించాలో అర్థంకాక మౌనంగా ఉన్నారు. కాసేపటి వరకు గదిలో నిశ్శబ్దం రాజ్య మేలింది. ఆ తర్వాత కుమారుడు గుండె నిబ్బరం చేసుకొని మాట్లాడటం మొదలు పెట్టాడు.

కొడుకు: పరదేశం నుండి ఎప్పుడు వచ్చారు?

తండ్రి: నిన్ననే వచ్చాను.

కొడుకు: మళ్ళీ ఎప్పుడు వెళతారు?

తండ్రి: నీతో మాట ముగించిన వెంటనే బహుశా...

కొడుకు: ఎక్కడికి వెళ్తారు?

తండ్రి: మీ అమ్మ దగ్గరికి.....కన్నీరు తుడుచుకుంటూ సమాధానమిచ్చాడు. మళ్ళీ కాస్సేపు గదిలో నిశ్శబం.... ఇద్దరి కళ్ళ నుండి కన్నీటి ప్రవాహం.... కొద్ది నిముషాల తర్వాత మళ్ళీ కుమారుడు జరిగిన సంఘటన గురించి వివరించటానికి నోరు విప్పాడు.

కొడుకు: అసలు జరిగిందేమిటంటే గత రెండు సంవత్సరాల నుండి కొంత మంది స్నేహితుల ద్వారా హెరాయిన్‌కు అలవాటు పడ్డాను. **"హెయ్ గాయ్! ఇది తాగి చూడు నీ బాధలన్నీ మర్చిపోతావు. నీలో లైంగి సామర్థ్యం పెరుగుతుంది, నక్షత్రాలలో విహరిస్తావు"** అంటూ నాకు కాస్తా హెరాయిన్ ఇచ్చారు. వారి మాటలు వాస్తవాలు అనుకొని అలా మొదటిసారి హెరాయిన్ సేవించాను. సేవించాక ఫలితం తలక్రిందలైంది. నా పరిస్థితే మారిపోయింది. బాగా అలసట అనిపించటం. ఎక్కువగా నిద్ర పోవటమే కాకుండా శారీరక శక్తి మరియు జ్ఞాపక శక్తి రెండూ నశించసాగాయి, చివరకు మతి సామర్థ్యం క్షీణించింది.

నాదే కాదు నా స్నేహితుల పరిస్థితి కూడా దాదాపు ఇటువంటిదే. ఉద్యోగాలు చేసేవారు ఉద్యోగాలు పోగొట్టుకున్నారు. వ్యాపారస్థుల వ్యాపారం ఎత్తి పోయింది. కాలేజీలో చదువుకునేవారి చదువు ఆగిపోయింది. వారు కాలేజీలో నుంచి గెంటివేయ బడ్డారు. ఇంత జరిగినా మా వంటి వ్యసపరుల ఆశయం ఒక్కటే–ఎలాగైనా డబ్బు సాధించి హెరాయిన్ సేవించడం. మా ఈ ఆలోచన మాలోని సిగ్గు, లజ్జ, ఆత్మగౌరవం వంటి లక్షణాలన్నింటిని నాశనం చేసి వేసింది.

(మిగతాది 15వ పేజీలో)

3వ పేజీ మిగతా భాగం

రక్తం - జీవాన్నిచ్చే ద్రవం

ఆటోమెటిక్‌గా పనిచేసే అత్యవసర వ్యవస్థ



ఎర్ర రక్తకణం యొక్క జీవితకాలం దాదాపు 120 రోజులు. ఆ తరువాత వాటి ని స్లీప్ (ప్లీహం) తొలగిస్తుంది. ఈ నష్టాన్ని సరి చేయడానికి, నిరంతరం కొత్త కణాల ఉత్పత్తి జరుగుతూ ఉంటుంది. సాధారణ పరిస్థితులలో ఒక సెకనులో 2.5 మిలి యన్ల ఎర్రరక్త కణాలు ఉత్పత్తి అవుతాయి. అవసరమైనప్పుడు, ఈ సంఖ్య పెరుగు తుంది. కిడ్నీలలో తయారయ్యే **'ఎరిథ్రో పోయ్‌టిన్'** అనే హోర్మోన్ ఈ ఉత్పత్తి వేగాన్ని క్రమబద్ధీకరిస్తుంది. ఉదాహరణకు, ప్రమాదాల వల్ల భారీగా రక్తం కారడం లేదా ముక్కునుండి రక్తం కారడం జరిగినప్పుడు, ఆ నష్టం వెంటనే బేలన్స్ అవుతుంది.

అంతేకాకుండా, గాలిలో ఆక్సిజన్ శాతం తగ్గితే, ఈ ఉత్పత్తి వేగం పెరుగుతుంది. ఉదాహరణకు, బాగా ఎతైన ప్రదేశాలపై ఎక్కుతున్నప్పుడు, గాలిలో ఆక్సిజన్ స్థాయి తగ్గుతూ ఉన్నప్పుడు, శరీరం ఆటోమెటిక్‌గా రక్తకణాల ఉత్పత్తిని పెంచి, అందుబాటులో ఉండే ఆక్సిజన్‌ను చాలా సమర్థవంతంగా ఉపయోగించుకుంటుంది.

పెర్‌ఫెక్ట్ ట్రాన్స్‌పోర్టేషన్ వ్యవస్థ

రక్తంలో ఉండే ద్రవ భాగాన్ని ప్లాస్మా అంటారు. ఈ ప్లాస్మా రక్త కణాలనే కాకుండా శరీరంలో ఉండే ఇతర పదార్థాలను కూడా తీసుకెళుతుంది. ప్లాస్మా స్పష్టమైన పసుపు రంగు ద్రవం. ఈ ప్లాస్మా సాధారణ శరీర బరువులో 5 శాతం ఉంటుంది. ఈ ద్రవం లో 90 శాతం నీరే. దీనిలో లవణాలు, మినరల్స్, కార్బోహైడేట్స్, కొవ్వు మరియు వందల సంఖ్యలో భిన్న రకాల ప్రోటీనులు మునిగి త్రేలుతూ ఉంటాయి. రక్తంలోని ఈ ప్రోటీనులలోని లిపిడ్స్‌ను కలిపి ఉంచి, టిష్యూలకు తీసుకు వెళ్ళే ట్రాన్స్‌పోర్ట్ ప్రోటీనులు కొన్ని ఉంటాయి. ఈ ప్రోటీన్‌లు కనుక ఈ విధంగా లిపిడ్స్‌ను తీసుకెళ్ళకపోతే, ఈ లిపిడ్స్ ఓ పద్ధతి లేకుండా త్రేలుతూ, తీవ్ర ఆరోగ్య సమస్యలకు కారణమవుతాయి.

ప్లాస్మాలోని హోర్మోనులు ప్రత్యేకమైన కొరియర్ల పాత్ర పోషిస్తాయి. ఇవే శరీరంలోని అవయవాలకు, కణాలకు మధ్య రసాయన సందేశాల ద్వారా సమాచారాన్ని ఇచ్చి పుచ్చుకోవడాన్ని సులువుచేస్తాయి.

అల్బుమిన్ ప్లాస్మాలోని ప్రముఖ ప్రోటీన్, ఇది ఒక ట్రాన్స్‌పోర్టర్. ఇది కోలెస్ట్రాల్, హోర్మోనులు, బిలిరుబిన్ లేక పెన్సిలిన్ వంటి మెడిసిన్స్ వంటి లిపిడ్స్‌ని కలిపి ఉంచుతుంది. విషపదార్థాలను లివర్‌లో వదలిలేసి, మిగతా పోషక పదార్థాలని మరియు హోర్మోనులను వాటి అవసరం ఎక్కడైతే ఉందో ఆ చోటుకి తీసుకెళతాయి.

ఈ విషయాలన్నింటినీ గనుక మనం పరిగణలోకి తీసుకుంటే, మనకి స్పష్టమయ్యేదేమిటంటే మన శరీరం ఎంతో గొప్పగా (ఇన్ ఎక్స్‌టర్‌మెలయ డీటైల్డ్‌వే) సృష్టించబడింది. ప్రతీ ఒక్క ప్రోటీన్ యొక్క సామర్థ్యం ఎలా ఉంటుందంటే లిపిడ్, హోర్మోన్ మరియు మెడిసిన్‌ల మధ్య ఉండే తేడాను అది గుర్తించ గలుగుతుంది. అంతే కాదు వీటి అవసరం ఎక్కడ ఉందో, ఎంత మోతాదులో వీటి అవసరం ఉందో అన్నీ తెలుసుకోగలుగుతుంది.


అల్లాహ్ యొక్క దోషరహిత డిజైన్‌కు స్పష్టమైన సూచనలే ఇవన్నీ. ఆశ్చర్యాన్ని కలిగించే ఇటువంటి జీవరసాయన చర్యలు వేల సంఖ్యలో మన శరీరంలో జరుగుతూ ఉంటాయి. ట్రిలియస్ సంఖ్యలో ఉండే మన శరీరంలోని పరమాణువులన్నీ అద్భుతమైన సామరస్యంతో పనిచేస్తాయి. వాస్తవేమిటంటే ఈ పరమాణు వ్యవస్థలన్నీ కూడా తల్లి గర్భంలో ఏర్పడిన ఒకే ఒక కణం నుండి విభజన జరిగి ఏర్పడినవే.

ఇది ఓగొప్ప విషయాన్ని స్పష్టం చేస్తుంది. మానవ శరీరం యొక్క అద్భుత వ్యవస్థ ఒకే బిందువు నుండి మానవున్ని సృష్టించిన అల్లాహ్ యొక్క అద్భుత ఆర్టిస్ట్రీకి ప్రత్యక్ష సాక్ష్యం. ఖుర్‌ఆన్

"మేము మానవుణ్ణి మట్టి యొక్క సారంతో సృష్టించాము. తరువాత అతనిని ఒక సురక్షితమైన స్థానంలో పడే బిందువుగా మార్చాము. ఆ తరువాత ఈ బిందువుకు ముద్ద ఆకారాన్ని ఇచ్చాము. ఆపైన ముద్దను కండగా చేశాము. తరువాత మాంసపు కండను ఎముకలుగా చేశాము. ఆ తరువాత ఎముకలకు మాంసాన్ని తొడిగాము. ఆ పైన దానిని భిన్నమైన సృష్టిగా చేసి నిలబెట్టాము. కనుక అల్లాహ్ ఎంతో శుభప్రదుడు, సృజనకారులందరిలో కెల్లా ఉత్తమ సృజనకారుడు"

(ఖుర్‌ఆన్ 23:12-14)

ప్రత్యేకమైన కంట్రోల్ మెకానిజమ్



ఆర్టెరీస్ (ధమనుల) నుండి పోషక పదార్థాలు అవసరమైన టిష్యూలలోకి చొచ్చుకుపోవడానికి ఆర్టెరీ గోడలను దాటవలసి ఉంది. ఆర్టెరీ గోడలు చాలా సూక్ష్మ రంధ్రాలు కలిగి ఉన్నప్పటికి, ఏ పదార్థమూ దానంతట అదే చొచ్చుకుపోలేదు. ఈ చొచ్చుకు పోవడాన్ని సులువు చేసేది బ్లడ్ ప్రెషర్. అయినప్పటికీ అవసరానికంటే ఎక్కువ మొత్తంలో పోషక పదార్థాలు టిష్యూలకు వెళితే, ఆ టిష్యూలలో మంటకు ఇవి కారణమవుతాయి. అందువలన దానికొక ప్రత్యేకమైన మెకానిజమ్ ఏర్పాటు చేయబడింది. దాని ద్వారా బ్లడ్‌ప్రెషర్‌ని బేలన్స్ చేస్తూ, ద్రవాన్ని వెనుకకు తిరిగి బ్లడ్‌లోకి తీసుకోవడం జరుగుతుంది.

ఈ బాధ్యతను అల్బుమిన్ తీసుకుంటుంది. ఆర్టెరీ గోడలలోని రంధ్రాలకంటే ఈ అల్బుమిన్ పెద్దగా ఉంటుంది. ఇది రక్తంలో చాలా సంఖ్యలో సరిపోయినంత ఉంటుంది. స్పాంజ్ పీల్చినట్లు వాటర్‌ని పీలుస్తుంది. శరీరంలో అల్బుమిన్ లేకపోతే, ఎండిన చిక్కుడు గింజను నీటిలో వదలి ఉంచితే ఎలా ఉబ్బిపోతుందో అలా శరీరం ఉబ్బిపోతుంది.

(శాంతిబాట సౌజన్యంతో)

అబుల్ హసన్

నేటి బాలలే రేపటి పౌరులు



జనరల్ నాలెడ్జ్‌కు సంబంధించిన ఈ ప్రశ్నలు అలీ బాల విహార్‌లో తరచూ వేస్తుండేవాడు కనుక పిల్లలు చాలా సులభంగా సమాధానాలు ఇచ్చారు. తెలియని ప్రశ్నలకు రాయబారిని పంపి మరి జవాబు తెలుసుకున్నారు. హమ్జా ఇలా అన్నాడు: 'చూడండీ! పిల్లలూ! ఇప్పుడు నేను కొన్ని పొడుపు కథలు చెబుతాను. మీరందరూ కలిసి వాటిని విప్పాలి. అయితే ఒక షరతు జవాబు తెలిసిన వ్యక్తి ముందు చెయ్యెత్తాలి.

'నిన్న నేను పుట్టలేదు. రేపు నేను ఉండను. నేను ఎవరిని?'

ఒకడు- 'ఈరోజు' సార్! కరెక్ట్.

'నీళ్ళు- అవి భూమి నుండి రాలేదు. ఆకాశం నుండి కురవనూ లేదు. అవేమి?'

ఓ బాలిక - 'కన్నీర'ండి. కరెక్ట్.

'కొంగ అప్పుడప్పుడు ఒక కాలు మీద ఎందుకు నిలబడుతుంది?'

మరో అమ్మాయి -'రెండో కాలు కూడా ఎత్తితే పడిపోతుంద'ని పిల్లలందరూ గలగల నవ్వసాగారు. కరెక్ట్.

'నేను జల కుమార్తెను. నన్ను నీటిలో వదిలేస్తే చచ్చిపోతాను'

ఓ అబ్బాయి 'మంచుగడ్డ'. కరెక్ట్.

'ఓ వస్తువు దానికి చర్మముంది కాని అది జంతువు కాదు. ఆకులున్నాయి కాని అది చెట్టు కాదు. మాట్లాడగలదు కాని అది మనిషి కాదు'

పిల్లలందరూ గంభీరంగా ఆలోచిస్తున్నారు. ఏమైవుంటుందబ్బా....అంటూ గుసగుసలాడుకుంటున్నారు. చివరికి ఓ బాలుడు- **'పుస్తకం'** శబాష్!

అల్‌హమ్దులిల్లాహ్ మీరందరూ చాలా చక్కగా సమాధానాలు ఇచ్చారు. ఇదే స్ఫూర్తితో కొనసాగితే మీరు గొప్ప వ్యక్తులుగా రాణించ గలుగుతారు అని ప్రశంసించి నిష్క్రమించాడు హమ్జా. అందరికీ బహుమానాలు ఇవ్వడం జరిగింది. గ్రూపుగా ఆడినవారికి, పరీక్షలు వ్రాసిన వారికి ఒక్కో మెడల్ కూడా ప్రదానం చెయ్యబడింది. పిల్లలంతా సంతోషంతో ఎగురుతూ దుము కుతూ తమ తమ ఇళ్ళకు బయలుదేరారు.

ఈ క్విజ్ కార్యక్రమం ద్వారా అలీ చాలా సంతృప్తి చెందాడు. చాలా సంతోషించాడు. నేటి ఈ రిజల్టుతో అలీకి బాగా ధైర్యం వచ్చింది. ఇప్పుడు పిల్లలు కేవలం పరీక్షల్లో ఉత్తీర్ణులు కావడమే కాకుండా ఇక ముందు కూడా వాళ్ళకు ఈ ప్రవక్తల గాథలు, పద్యాలు, దుఆలు జ్ఞాపకం ఉండగలవనే నమ్మకం అలీకి కలిగింది. కాని చేయవలసింది ఇంకా చాలా ఉంది. అయినా అతనికి లభించిన సఫలత అతని ఉత్సాహాన్ని ఇనుమడింపజేస్తూ ఉంది.

అస్ర్ నమాజు చదువుకొని అలీ చెరువు గట్టు మీదున్న వేప చెట్టు క్రింద కూర్చొని ప్రకృతి అందాన్ని, పచ్చని పొలాల సోయగాల్ని తనివితీరా ఆస్వాదిస్తున్నాడు. అంతలోనే పైనుంచి ఎవరో తన్ను తల మీద కొట్టినట్టు అన్పించింది. ఎవరై ఉంటారు అని చెట్టుకేసి చూశాడు అలీ. 'నఫ్సె అమ్మారా' చెట్టుకొమ్మల పై కొమ్మచ్చిలాడుతూ కనబడింది. **హాయ్ బ్రదర్! హౌ ఆర్‌యు?** నీవు గొప్ప విద్యావేత్తవే కానీ, అనుభవజ్ఞుడివి కాదు. నీకు ఇంకా వ్యవహారిక అనుభవం లేదు. నీ దృష్టిలో అన్ని విషయాలు సిద్ధాంతమయంగా ఉంటాయి. నీ పప్పులేమీ ఇక్కడ ఉడకవు. నీ విద్యార్థులు తెలివి గల వారనీ, నీ బాల విహార్ అందమైనదనీ, నీ క్విజ్ కార్యక్రమం ఆదర్శవంతమైనదనీ నలుగురు నాలుగు విధాలుగా నిన్ను పొగడాలనేగా నీవు ఇవన్నీ చేస్తున్నది. ప్రజల్లో మంచి స్థానం సంపాదించుకొని నీ స్వార్థం నీవు చూసుకోవాలనేగా నీ ఈ తాపత్రయం. వాస్తవంగా నీవు ఏమిటో, ఏమి కాదో నీకు మాత్రం తెలియదా ఏమిటి..!!?

అలీ మనసు శాంతంగా ఉన్నా మెదడు వేడెక్కింది. ఇది గమనించిన 'నఫ్సె లవ్వామా' ఇలా సంబోధించింది: 'అయ్యా క్షమించండి! కాస్తంత ఉద్రేకంగానే మాట్లాడుతోంది. అల్లాహ్ నన్ను క్షమించుగాక! నేను చేసే పనుల్ని ప్రజలు గమనించినా, గమనించకపోయినా, నా ఉద్దేశాలను మాత్రం అల్లాహ్ గమనిస్తున్నాడన్న విషయం నేను ఎన్నడూ మరువను. నా విద్యార్థులు తెలివితేటలను, యోగ్యతనూ, అభిరుచిని ప్రదర్శించారు. అందుకు నేను చాలా సంతోషిస్తున్నాను. నిజంగా వారిలో కొందరు విద్యార్థులు భవిష్యత్తులో మంచి పండితులుగానూ, ఉత్తమ పౌరులుగానూ, మానవత్వం గల నిజమైన మనుషులుగానూ తయారు కాగలరనే నమ్మకం నాకుంది. అల్లాహ్ నా చిరు ప్రయత్నాన్ని వృధా చెయ్యడన్న దృఢ విశ్వాసం కూడా నాకుంది. రేపు వారు పెద్దయ్యాక వారు జీవించే సమాజంలో, సొంతంగా వారి కుటుంబాల్లో తలెత్తే సమస్యల్ని కలిసికట్టుగా ఎలా పరిష్కరించాలో కూడా వారు తెలుసుకోగలిగారు. అలాగే తనకు తెలియని విషయాలను జ్ఞానవంతుల వద్దకు వెళ్ళి తెలుసుకోవాలన్న అవగాహన కూడా వారికి కలిగింది. వారిని ప్రోత్సహించడానికే ఈ బుహమతులు ఏర్పాటు చేశాను. ఈ పద్ధతిని మంచి మార్పును కోరే ప్రతి ఒక్కరూ ఆహ్వానిస్తారన్న విశ్వాసం కూడా నాకుంది. ఈ రోజు బహుమతులు అందుకుంటూ వారి ముఖాలలో కనిపించిన ఆనందం వర్ణనాతీతం. అల్లాహ్ నన్ను ప్రదర్శనాబుద్ధి నుండి, లేనిపోని ప్రగల్భాలు పలకడం నుండి దూరంగా ఉంచాలని అన్ని తెలిసిన అల్లాహ్‌ను వేడుకుంటున్నాను. ఇది విన్న 'నఫ్సె అమ్మారా' (చెడు తలంపు మనసు) తనపై దుమ్మెత్తి పోసుకుంటూ కాళ్లకి బుద్ధి చెప్పింది.

అలీ తయారు చేసుకున్న ప్రణాలికల్లో - 'నాటిక ప్రదర్శన' మిగిలి ఉంది. అలాగే మహల్లాల్లో శుచీశుభ్రతల కార్యక్రమం కూడా ఉంది. పిల్లలు ఈ రెండు పనుల్ని చాలా నిర్మాణయుతంగా, నియమబద్ధంగా చేయగలగాలి. కనుక నేర్పడం, నేర్చుకోవడం, నాటిక ప్రదర్శన లాంటి కార్యక్రమం అంతా ఈసారి నది ఒడ్డున జరపాల్సి ఉంది. అడుతూపాడుతూనే ఈ ట్రైనింగ్ ఇవ్వాలి. గతంలో మాదిరిగానే ఈసారి కూడా 'ఆదివారం' బయలుదేరాలని నిర్ణయించుకున్నాడు అలీ.

షేక్: హబీబుర్రహ్మాన్

మంచి మాట పసిడి మూట

➪ వృద్ధాప్యంలో వుండే తల్లిదండ్రుల, అత్త మామల సంపదను, ఆస్తులను ఆశించి వారిని హింసించే కొడుకులు, కూతుళ్ళు, అల్లుళ్ళు శత్రువులకన్నా హీనులు.

➪ బతకడానికి తినాలి తప్ప – తినడానికే బతక్కూడదు.

➪ కీర్తి అత్తరులాంటిది, పైపైన చల్లుకో వాలే గాని తాగుతూ కూచోకూడదు.

– హరివంశ రాయ్ బచన్

➪ త్వరపడి స్నేహాలు చేసుకోకూడదు. ఒక సారి ఒకరితో స్నేహం చేశాక అది కల కాలం నిలవాలి. **–సోక్రటీస్**

➪ బంగారంలో ప్రతి రేణువు విలువైనట్లే, కాలంలో ప్రతి క్షణమూ విలువైనదే.

➪ ప్రస్తుతమున్న అవకాశాన్ని వాడుకోలేని వారు, ఎన్ని అవకాశాలిచ్చినా ఏమీ చేయ లేరు.

➪ మనిషిని భయం అనారోగ్యం కన్నా ఎక్కువగా బాధిస్తుంది.

➪ మనుషులు చేయకూడని పనులు చేసి నందువల్ల చెడినట్టే, చేయాల్సిన పనులు చేయకపోయినా చెడతారు.

➪ మాట్లాడిన మాట, వదిలిన బాణం, జరి గిన కాలం, వదులుకున్న అవకాశం– ఈ నాలుగు వెనక్కి రావు.

➪ ఒక్కో సారి మనం చేయగలిగిన పనుల కన్నా చేయకూడని పనులు తెలుసుకోవ డం చాలా అవసరం.

గుడ్ కీ

➪ నమాజు ***కీ*** తహారత్ (వుజూ)

➪ స్వర్గానికి ***కీ*** తౌహీద్

➪ సాఫల్యానికి ***కీ*** తఖ్వా

➪ స్వీకారయోగ్యానికి ***కీ*** దుఆ

➪ హజ్ ***కీ*** ఇహ్రాం

➪ సదాచరణకి ***కీ*** సిద్ఖ్

➪ ఆధిక్యానికి ***కీ*** కృతజ్ఞత

➪ ఉపాధికి ***కీ*** ఇస్తిగ్‌ఫార్ మరియు దైవ భీతితో ప్రయత్నించటం.

బ్యాడ్ కీ

➪ కపటత్వానికి ***కీ*** అబద్ధం

➪ వ్యభిచారానికి ***కీ*** పాటలు పాడటం మరియు వినటం

➪ అవిశ్వాసానికి ***కీ*** అన్ని రకాల పాపాలు.

➪ ప్రతి కీడుకి ***కీ*** ఐహిక లాలస, అత్యాశ.

నిజ ధర్మమేదో తెలుసుకో!

"అల్ గర్‌నాత్" అనే వ్యక్తి బెర్షలోనాలో జన్మించాడు. 1969లో పాకిస్తాన్‌లో ఇస్లాం స్వీకరించారు. ఒక ప్రశ్నకు సమాధానం గా ఆయన ఇలా అన్నాడు: "నా బాల్యంలో మా అవ్వ, మరణ ఘడియల్లో నన్ను పిలిచి ఇలా చెప్పింది: 'నాయనా! క్రైస్తవ మతం మన మతం కాదు. అది సత్యమూ కాదు. నువ్వు పెద్దయిన తరువాత నిజ ధర్మాన్ని తెలుసుకునే ప్రయత్నం చెయ్యి, ఆయన పెద్దయిన తరువాత స్పేయిన్ చరిత్రను తర్క దృష్టితో చదివి, అవ్వ మాటను అర్థం చేసుకుని ఇస్లాం స్వీకరించాడు.

అబూబకర్ సిద్దీఖ్ (ర)

ఇస్లాంకు పూర్వం ఆయన పేరు అబ్దుల్ కఅబ్. ఇస్లాం స్వీకరించాక దైవ ప్రవక్త(స) ఆయనకు అబ్దుల్లాహ్ అని నామకరణం చేశారు. అబూబకర్ ఆయన మారు పేరు. సిద్దీఖ్ ఆయన బిరుదు.

ఏనుగుల సంఘటన జరిగిన రెండున్నర సంవత్సరాలకు జన్మించారు. అంటే దైవ ప్రవక్త(స)కన్నా వయస్సులో రెండు సంవ త్సరాలు చిన్నవారు.

హజ్రత్ అబూబకర్(ర) జమాది ఉల్ ఆఖిర్ నెల 22వ తేదిన మగ్రిబ్ మరియు ఇషా మధ్య సమయంలో మరణించారు. హజ్రత్ ఉమర్ (ర) జనాజా నమాజ్ చేయించారు. అదే రోజు రాత్రి హజ్రత్ ఆయిషా (ర) గారి గదిలో దైవప్రవక్త(స) సమాధి ప్రక్కన ఆయన అంత్యక్రియలు జరిగాయి. ఆయన ఖలీఫాగా 2 సంవత్స రాల 3 నెలల 11 రోజులు పరిపాలిం చారు. మరణించేనాటికి ఆయన వయస్సు 63 సంవత్సరాలు.



అంకెల్లో..

రూ.5.33 కోట్లు
ప్రస్తుత లోక్‌సభలో ఒక ఎంపీ సగటు ఆస్తి. 2004లో అది రూ.1.86 కోట్లు.

18.1 కోట్లు
రిజర్వ్‌బ్యాంకు లెక్కల ప్రకారం మనదేశంలో వినియోగంలో ఉన్న డెబిట్ కార్డులు. క్రెడిట్‌కార్డుల సంఖ్య 2 కోట్లు.

2.68 కోట్లు
మనదేశంలోని దిగువ కోర్టుల్లో పెండింగులో ఉన్న కేసులు. వీటిలో క్రిమినల్ కేసులు 1.9 కోట్లు.

70,000
ఇటలీలో పిల్లుల జనాభా. ఐరోపాలో బ్రిటన్ తరవాత అత్యధిక పిల్లులు ఉండేది అక్కడే.

రూ.80,000 కోట్లు
మనదేశంలో వివాహ మార్కెట్ విలువ.

315
2009లో లోక్‌సభకు ఎన్నికైన ఎంపీల్లో కోటీశ్వరులు. 2004లో ఈ సంఖ్య 156.

1.2 కోట్లు
ఏటా మనదేశంలో అమ్ముడయ్యే ద్విచక్ర వాహనాలు.

7
ప్రధాని మన్మోహన్‌సింగ్ గతంలో ఓ అధికారి హోదాలో పని చేసిన ప్రధానమంత్రుల సంఖ్య

108.5 టన్నులు
ఈ ఏడాది ఏప్రిల్-జూన్ మధ్యలో భారతీయులు కడ్డీలు, నాణేల రూపంలో కొనుగోలు చేసిన బంగారం.

25,400 కోట్లు
ప్రపంచవ్యాప్తంగా సగటున ఒక రోజులో పంపే ఈమెయిళ్లు.

70 శాతం
మనదేశంలో ఉత్పత్తయ్యే ఉప్పులో గుజరాత్ వాటా.

ఎవరు బాధ్యులు..?

సిగ్గు వదిలిన నేను అనేక దొంగతనాలు చేశాను. ఇంట్లోని ఖరీదైన వస్తువులను దొంగలించి అమ్మి వేసినాను. ఎన్నో కట్టు కథలు చెప్పి అమ్మ దగ్గర నుండి డబ్బులు తీసుకెళ్ళాను. ఒక రోజు మాత్రం నేను హెరా యిన్ సేవిస్తున్నానన్న విషయం అమ్మకు తెలిసి పోయింది. ఆమె చాలా ఆగ్రహించింది, ఈ దుర అలవాటు మానక పోతే మీ నాన్నకు చెబుతానని హెచ్చరించింది. తన ప్రేమ మరియు మమకారంతో నాకు దగ్గర తీసుకొని జీవితంలో జరగబోయే నష్టాలను వివరిం చింది. మాకున్న ఏకైక కుమారుడవు నీవు. నీకేమైనా జరిగితే మేము తట్టుకోలేము. నీకు మంచి ఆసుపత్రిలో చికిత్స చేయిస్తాను పదా అని బతిమిలాడింది. కాని నేను ఆమె మాటలను పట్టించుకోలేదు. రోజులు గడిచే కొద్దీ నాకు డబ్బు అవసరం ఎక్కువయింది. అమ్మకు అడిగితే చిల్లి గవ్వ కూడా ఇచ్చేది లేదని తేల్చి చెప్పింది. ఇక నేను ఏ కథ అల్లినా అమ్మ దగ్గర చెల్లేది కాదు. ఆమె వైఖరి కఠినంగా మారిపోయింది.

ఈ హత్యకు పాల్పడిన రోజైతే నా స్నేహితు లకి కూడా హెరాయిన్ ఇప్పిస్తానని నేను మాట ఇచ్చాను. అందుచేత నాకు ఎక్కువ డబ్బు అవసరమయింది. నేను ప్రయాణించే కారు ప్రమాదానికి గురైందని ఒక కట్టు కథ అమ్మకు వినిపించి వెయ్యి డాలర్లు అమ్మకు ఇమ్మని అడిగాను. నాకు నీ చేష్టలన్నీ తెలుసు. నా దగ్గర డబ్బు లేదని అమ్మ నిరాకరించింది. అటు వైపు చూస్తే స్నేహితులకు మాటిచ్చాను. ఇక్కడ చూస్తే అమ్మ డబ్బులు ఇవ్వనంటుంది. ఏమి చేయాలో దిక్కు తోచని సమయంలో నాకు ఒక నీచమైన ఆలోచన తట్టింది. నేను వెంటనే కోపంతో నీవు డబ్బులు ఇవ్వక పోతే నీకు ఇతరులతో అక్రమ సంబంధం ఉందని నాన్నకు చెబుతానని బెదరించాను. అమ్మ కోపంతో చెంప ఛెళ్ళుమనేట్టుగా ఒకటి పీకింది. థూ.. కన్నతల్లి గురించి ఇలాంటి నీచమైన మాటలు మాట్లాడటానికి నీకు నోరు ఎలా వచ్చింది...? నా కంటి ముందర నిల బడకుండా వెళ్ళు అంటూ తన గదిలోకి వెళ్ళి పోయింది. అప్పటికే మతి సామర్థ్యాన్ని కోల్పో యిన నాకు ఎక్కడ లేని కోపం పుట్టుక రావ టమే కాకుండా నా నోట వచ్చిన మాటలు వాస్తవమైనవే అన్నట్లుగా ఊహ చిత్రాలు నా మెదడులో తిరగసాగాయి. తత్కారణంగా ఆమెకు బ్రతికే అర్హత లేదన్న నిర్ణయానికి వచ్చాను. వెంటనే కిచెన్ రూమ్‌లోకి వెళ్ళాను, అక్కడ మాంసం కోసే కత్తి నా కంట పడింది, దాన్ని చేత పట్టుకొని అమ్మ గదిలోకి వెళ్ళాను. అప్పటికి అమ్మ కోపంతో...వాగుతూనే ఉంది.



ఒసేయ్! 1000 డాలర్లు ఇస్తావా లేదా? అని కత్తి చూపిస్తూ మరొకసారి బెదిరించాను. నేను ఇవ్వనంటే ఇవ్వనంతే అని అమ్మ తేల్చి చెప్పేసింది. ఇక ఏముంది సహనం కోల్పో యి చేతిలో ఉన్న కత్తితో ఆమెపై దాడి చేసాను. కక్ష తీర్చుకుంటున్న ఉన్మాదిలా ఆమే శరీరంపై అనేక గాయాలు చేసాను. చివరికి ఆమె కేకలు పెడుతూ ధడేలున క్రింద పడిపో యింది. గది నిండా రక్తపు మరకలే. కాసేపటకి.... ఆమె కేకలు.... శ్వాస.. రెండూ ఆగిపోయాయి. అప్పుడు నాకర్థమయింది నేను ఎంతటి ఘోరానికి పాల్పడ్డానో. కాని ఏం లాభం? అప్పటికే సమస్య చేజారిపోయింది.

జరిగిన క్రైంస్టోరి మొత్తం కుమారుని నోట విన్నాక వ్యాపారవేత్త కోపంతో ముఖం త్రిప్పు కొని, అసహ్యించుకుంటూ పెద్ద పెద్ద అడు గులు వేసుకుంటూ జైలు గది బయటకు నడి చాడు. అతని కుమారుడు కంగారుగా లేచి నిలబడ్డాడు. కానిస్టేబుల్ సెల్ తలుపు వేసి తాళం బిగించాడు. ఏమీ మాట్లాడకుండా వెళ్తున్న నాన్ననుద్దేశ్యించి కుమారుడు సెల్ కడ్డీలు పట్టుకొని బిగ్గరగా కేకలు వేసాడు:

నాన్నా ....! ఈ దుర్ఘటనకు అసలు బాధ్యు డవు నీవే.. కనక పైత్యం తలకెక్కిన తండ్రీ! ఈ హత్యకు కారకుడవు నీవే.... అసలు బాధ్యుడవు నీవే నాన్నా! అసలు బాధ్యుడవు నీవే...నీవే...నీవే...!!!



అతని కేకలు స్టేషన్ పరిధిలోనే ఉండి పోయాయి. అతనికి కోర్టులో హాజరు పరచి శిక్ష విధించే అవసరమే రాలేదు. కొద్ది రోజుల వరకు అతను జైలులో ఉండగా పూర్తిగా పిచ్చివాడయిపోయాడు. అతనికి పిచ్చాసుపత్రికి తరలించారు. అతనికి ఎవరు ఎదురు పడినా అతని నోట ఒకే మాట వస్తుంది. అదేమిటంటే, **'నా తండ్రే బాధ్యుడు; నా తల్లి లోకంలోనే ఉత్తమ మహిళ, పరమ శీలవతి'** అని.

ప్రియ పాఠకులారా మీకు, కైరో నగరంలో ని **'దఖీ'** ఏరియాలోని మస్జిద్‌కి వెళ్ళే అవకాశం కలిగితే అక్కడ ఓ మూలన తెల్లటి బట్టలలో ఖురాను చదువుతూ ఓ వ్యక్తి కనిపి స్తాడు, అతను ఖురాన్ పారాయణం ముగిం చాక రెండు చేతులు పైకెత్తి దైవంతో క్షమాపణకై ప్రార్థిస్తాడు. ఒక వేళ అతని పక్కన నిలబడి నమాజ్ చదివే అవకాశం మీకు లభిస్తే నమాజ్ పూర్తయ్యాక అతను మీకు పలకరిస్తూ సలాం చెబుతాడు. **'కొంచెం సమయం కేటాయిస్తే నేను మీతో కొంచెం మాట్లాడదలిచాన'**ని మీ అనుమతి కోరతాడు. అతను మరెవరో కాదు; ఇంత వరకు ఓ వ్యాపారవేత్త గురించి మీరు చదివారు కదా! ఆ వ్యక్తి ఇతనే. ప్రస్తుతం తాను సంపాదించిన ధనం మొత్తం హెరా యిన్‌ని నిర్మూలించే సంస్థకి విరాళంగా చెల్లించి దైవారాధనలో నిమగ్నుడయ్యాడు. మీరు అతనికి మాట్లాడే అనుమతి ఇస్తే మీ చెయ్యి పట్టుకొని కూర్చోబెట్టి జరిగిన కథంతా వినిపిస్తాడు. ఆ తరువాత మీకు అవాక్కయోలా కొన్ని ప్రశ్నలు అడుగుతాడు అవి–

1) ఈ ఘటనకు అసలు బాధ్యులెవరు?

2) కుటుంబ సభ్యుల గురించి ఎలాంటి శ్రద్ధ తీసుకోకుండా సంపాదన గురించే ఆలోచించుకుంటూ ఉండిపోయిన నేను బాధ్యుడనా?

3) అడిగినప్పుడల్లా డబ్బు ఇస్తూ వచ్చిన నా భార్య బాధ్యురాలా?

4) డబ్బు ఇవ్వకపోతే తన కుమారుడికి ఈ అలవాటు తప్పుతుందని డబ్బులివ్వటానికి నిరాకరించిన తల్లి మమతనా?

5) స్నేహం పేరుతో నా కొడుకును పాడు చేసిన ఫ్రేండ్స్ బాధ్యులా?

5) ఎలాంటి అనుభవం లేకుండా హెరా యిన్‌కి అలవాటు పడ్డ నా కుమారుడు బాధ్యుడా?

6) మాదకద్రవ్యాలను అమ్ముతున్న వారిని పట్టించుకోని ప్రభుత్వమా?

ఆమినా అస్సిల్మి

చీకటి నుండి వెలుగు వరకు

అరబ్బులందరిని క్రైస్తవులుగా మార్చాలనుకున్న సదరన్ బాప్టిస్ట్ యువతి, ఒక కంప్యూటర్ మిస్టేక్ వలన సత్య ధర్మంలోకి అడుగిడి, 32 సంవత్సరాలుగా అమెరికాలోని క్రైస్తవులను ఇస్లాం వైపునకు ఆహ్వానిస్తున్న ఈమె 1975లో అసమాన సామర్థ్యమున్న బ్రాడ్‌కాస్ట్ జర్నలిస్ట్. అవార్డులను గెలుచుకుంటూ, సొంత వ్యాపారాన్ని చూసుకునే ఈమె జీవితం ఓ విచిత్రమైన మలుపు తిరిగింది.

"నేను ముస్లింనని చెప్పుకోవడానికి సంతోష పడుతున్నాను. ఇస్లాం నా జీవితం. ఇస్లాం నా గుండె చప్పుడు. ఇస్లాం నా రక్త నాళాలలో ప్రవహించే రక్తం. ఇస్లాం నా బలం. ఇస్లాం నా అద్భుతమైన, అందమైన జీవితం. ఇస్లాం లేకుండా నేను లేను. అల్లాహ్ తన చూపుని నా వైపు నుండి త్రిప్పితే నేను బ్రతకలేను." అని చెప్పిన ఈ సోదరి ఇస్లాం కోసం ఎన్నో త్యాగాలను అల్లాహ్‌పై విశ్వాసంతో సునాయాసంగా చేసి, 16సంవత్సరాల పాటు ఎన్నో కష్టాలను ఎదుర్కొని, చివరకు తన జీవితంలో కోల్పోయినదానికంటే ఎన్నో రెట్లు ఎక్కువయిన దానిని సాధించి తోటి ముస్లింలకు ఆదర్శమయిన సోదరి అమీన అస్సిల్మి యొక్క జీవిత కథను ఈ నెల అందిస్తున్నాం.

ఆమినా మొదటిసారి ముస్లిములను కలసినప్పుడు, రిక్రియేషన్‌లో ఆమె డిగ్రీ పూర్తి కావస్తుంది. డిగ్రీ మొదటి సంవత్సరంలోనే తీసుకుబోయే కోర్సు గురించి ముందుగానే రిజిష్టర్ చేసుకోవచ్చు. ఆ విధంగా రిజిష్టర్ చేసుకుని తన పనులు చూసుకోవడానికని ఓక్లహోమా వెళ్ళారు. ఆ వ్యవహారాలు పూర్తి కావడానికి అనుకున్న దానికంటే ఎక్కువ సమయం పట్టడం వలన, స్కూలుకి ఆలస్యంగా రావడం జరిగింది. ఇక ఇప్పుడు ఏదైనా ఓ కోర్సుని డ్రాప్ చేసుకోవడానికి అవకాశం లేదు. మిస్సయిన వర్క్‌ని అందుకోవడంలో ఆమెకి కంగారుపడవలసిన అవసరం లేదు. క్లాసులో, తన సబ్జెక్ట్‌లో టాప్ ర్యాంక్‌లో ఉంటూ, ప్రొఫెషనల్స్‌తో కూడా పోటీ పడీ చాలా అవార్డులు గెలుచుకున్నారు. ఇంత ప్రతిభ ఉన్నప్పటికీ, ఆమెకున్న అమితమై సిగ్గుబిడియాల కారణంగా ఇతరులతో చాలా తక్కువగా మాట్లాడేవారు. ఎవరితోనైనా మాట్లాడటం చాలా అరుదు. బాగా అవసరమైతేనే మాట్లాడేవారు లేదా తెలిసినవారితోనే మాట్లాడటానికే ఇష్టపడేవారు. ఆమె తీసుకునే క్లాసులు ఎడ్మినిస్ట్రేషన్,సిటీ ప్లానింగ్, పిల్లల ప్రోగ్రామింగ్ మొ:వి. కాని ఆమె ఎక్కువగా హాయి పొందేది పిల్లలతోనే. సరే, కథలోకి వెనెక్కి వెళితే.....

కంప్యూటర్ ప్రింటవుట్ ఆమెకో షాక్ ఇచ్చింది. ఇంతకి తాను రిజిస్టర్ చేసుకున్నది ఓ థియేటర్ క్లాస్ (అంటే పొరపాటున, థియేటర్ క్లాసుగా రిజిస్టర్ అయ్యింది.) థియేటర్ క్లాసంటే ప్రత్యక్షంగా, మనుషుల ఎదురుగా ప్రదర్శించవలసి ఉంటుంది. క్లాసులో ఓ ప్రశ్నను సహితం అడగలేని ఆమె, ప్రజలెదురుగా స్టేజి మీదికెళ్ళడానికి భయపడింది.

ఎప్పుడు ప్రశాంతంగా ఉండే ఆమె భర్త, ఆమె సమస్యను క్లాస్ టీచర్‌కు వివరించమని సలహా ఇచ్చారు. ఈ విషయం నుండి ఆమెను బయటపడేలా చేయడానికి టీచర్ ప్రయత్నిస్తానని భరోసా ఇచ్చింది. కాబట్టి క్లాసుకు వెళ్ళారు. అయితే ఆమెకి రెండవ షాక్ ఏమిటంటే, క్లాసు పూర్తిగా అరబ్బులతో నిండి ఉండటమే. ఎప్పుడు అరబ్బులను ప్రత్యక్షంగా చూడని ఆమెకు క్లాసులో ఓ సమూహమే కనిపించే సరికి,వారిపై తనకుండే ద్వేషం దురభిప్రాయల వలన, క్లాసులో కూర్చోకుండా ఇంటికి వెళ్ళి పోయింది.



ఆమె చెప్పారు "ఈ సందర్భంలో మీరు ఓ విషయాన్ని తెలుసుకోవాలి. నేను లెదర్ హాట్ ప్యాంట్ తీసుకుని, పై భాగాన తాళ్ళతో కట్టుకునే టాప్‌ను ధరించి, చేతులలో మందు గ్లాసుతో ఉన్న నా లాంటి మహిళకు (నా మనస్సుకు నాకంటే ఆ) అరబ్బులే చెడ్డవారిగా అనిపించారు."

ఇక క్లాసుకు మళ్ళీ వెళ్ళే ప్రసక్తి లేదని ఆమె తన భర్తతో చెప్పినప్పుడు, ఆయన తన సహజ ప్రశాంత ధోరణిలోనే స్పందించారు. ప్రతీ దానికి దైవం ఏదో ఓ కారణాన్ని ఉంచుతారనే విషయాన్ని భర్తకు ఎప్పుడూ ఈమె చెబుతూ ఉండేది. ఆ విషయాన్నే ఆమెకు గుర్తు చేసి, చివరి నిర్ణయం తిసుకునే ముందు, కొంత సమయం తీసుకుని, బాగా ఆలోచించుకోమని చెప్పారు. అంతే కాకుండా ఆమెకున్న స్కాలర్ అవార్డు వలన ట్యూషన్ ఫీజు కట్టవలసిన అవసరం లేదు. అది నిలబెట్టుకోవాలంటే క్లాసుకెళ్ళడం తప్పదు మరి.

ఆ తరువాత రెండు రోజులు ఏదైనా మార్గం చూపించమని దైవాన్ని ప్రార్థించింది. నరకాగ్ని నుండి ఈ బుద్ధిహీనుల్ని (అప్పటి ఆమె ఉద్దేశంలో అరబ్బులని) రక్షించడానికే దైవం ఆమెను ఈ క్లాసులో ఉంచడం జరిగిందని, తనకు తానే సర్ది చెప్పుకుని తిరిగి రెండు రోజులకు క్లాసుకు వెళ్ళింది.

క్లాసులో, జీసెస్‌ను వారి వ్యక్తిగత రక్షకుడిగా అంగీకరించకపోతే, వారు తమ పరలోక జీవితమంతా నరకాగ్నిలోనే కాలుతుంటారని ఆమె వివరించి చెప్పినా సరే, వారు మాత్రం చాలా మర్యాద చూపారే గాని, క్రైస్తవాన్ని స్వీకరించలేదు. తరువాత జీససెస్ వారిని ఎలా ప్రేమించాడో, వారి పాపాలనుండి కాపాడటానికి శిలువపై ఎలా మరణించాడో వివరిస్తూ, వారు మనస్ఫూర్తిగా అంగీకరించాలని చెప్పినా, తిరిగి వారు మర్యాద చూపారే కాని ఇంకనూ క్రైస్తవాన్ని స్వీకరించలేదు. కాబట్టి వారి స్వంత గ్రంథాన్ని చదివి, దాని ద్వారానే 'ఇస్లాం వాస్తవ ధర్మం' కాదని మరియు ముహమ్మద్ (స) 'వాస్తవ దైవం' కాదని వారికి నిరూపించాలనే నిర్ణయానికొచ్చింది. (క్రైస్తవులు, ప్రవక్త 'ఈసా'(అ)ను దైవంగా పూజిస్తారు కాబట్టి ముస్లిములు కూడా ముహమ్మద్ (స) వారిని దైవంగా పూజిస్తారని అప్పట్లో ఆమె భావించేవారు).

విద్యార్థులలో ఒకతను ఆమెకు ఒక ఖుర్'ఆన్ ప్రతిని, ఇస్లాం గురించి తెలియజేసే మరో పుస్తకాన్ని ఇచ్చాడు. ఆమె పరిశోధనను మొదలు పెట్టారు. తనకవసరమైన ఆధారం చాలా తొందరగా దొరుకుతుందనే నమ్మకంతోనే, ఆమె ఖుర్'ఆన్‌ను, రెండవ పుస్తకంతో పాటుగా, 15 ఇతర పుస్తకాలను మరియు సహీ ముస్లిం హదీసులను చదివాక, మరలా ఖుర్ఆన్ గ్రంథాన్ని చదవడం ప్రారంభించారు. అయితే అరబ్బుల నందరినీ క్రైస్తవులుగా మార్చాలనే పట్టుదల మాత్రం ఆమెలో అలాగే ఉంది. ఆమె చదువు మరో సంవత్సర మున్నర కొనసాగింది.

ఈ సమయంలో, ఆమెకు భర్తతో సమస్యలు మొదలయ్యాయి. ఇస్లాం అధ్యయనం వలన ఆమెకు తెలియకుండానే ఆమెలో వస్తున్న చిన్న మార్పే ఆయనని బాధించసాగింది. వారిద్దరూ ప్రతీ శుక్రవారం మరియు శనివారం బార్‌కి లేదా పార్టీలకి వెళ్ళేవారు. అంతకు ముందరిలాగ బార్‌కి వెళ్ళే కోరిక ఇప్పుడు ఆమెలో లేదు. ఆమె చాలా నిరాడంబరంగా మారింది. ఆమెకు తెలియకుండానే, ఆయన మనస్సుకు దూరం అవుతూ వుంది. తన భార్యలో వస్తున్న మార్పుని అతను మరోలా అర్థం చేసుకుని, ఆమె ఎవరితోనో సంబంధం పెట్టుకుందేమోనన్న అనుమానంతో, ఆమెను బయటికి వెళ్ళగొట్టాడు. పిల్లలతో పాటు ఓ అపార్ట్‌మెంట్‌లోకి మారింది. కాని ముస్లింలను క్రైస్తవులుగా మార్చాలనే కృషి, పట్టుదల ఆమెలో అలాగే ఉన్నాయి.

ఆమె చెప్పిన వర్ణన ప్రకారం, ఒక రోజు తెల్లటి పొడవైన నైట్‌గౌన్ లాంటిది ధరించి, తలపై ఎరుపు, తెలుపు గడులున్న టేబుల్ క్లాత్ లాంటిది ధరించిన ఓ వ్యక్తి ఆమె తలుపు తట్టాడు. ఆయనతో పాటు మరో ముగ్గురు పైజమాలు ధరించిన వారున్నారు (వారి సాంప్రదాయ దుస్తుల్ని చూడటం ఆమెకి అదే మొదటిసారి). రాత్రి వేసుకునే దుస్తులు లాంటి బట్టలతో కనిపిస్తున్న మగవాళ్ళని చూశాక, తనకి చాలా కోపం వచ్చింది. 'నన్ను ఎలాంటి ఆడదాన్ననుకుంటున్నారు వీళ్ళు? వీరికి సభ్యతాసంస్కారం లేదా? అని లోపల అనుకుంటుండగా, ఆమె షాక్‌ను అర్థం చేసుకున్న, టేబుల్ క్లాత్‌ను ధరించిన వ్యక్తే ముందుగా మాట్లాడాడు. ఆమె ముస్లిం కావాలని కోరుకుంటుందనే విషయం తనకు తెలిసిందని చెప్పాడు. తను ముస్లిం కావాలని కోరుకోవడం లేదని, తనొక క్రిస్టియన్‌నని చెప్పారామె. అయినప్పటికిని, వారికి సమయముంటే, ఇస్లాంపై తను కొన్ని ప్రశ్నలు అడగాలని అనుకుంటున్నట్లు కూడా తెలియజేశారామె. అతని పేరు అబ్దుల్ అల్-షేఖ్. ఆమెతో చర్చించడానికి సిద్ధమన్నాడు. అతని లోని సహనాన్ని ఆమె గుర్తించింది. ప్రతీ ప్రశ్నను ఆమెతో చర్చించాడు. ఆమె ఎప్పుడూ మూర్ఖంగా ఫీలయ్యేలా గాని, ఆమె అడిగిన ప్రశ్న బుద్ధిహీనమైనదనిగాని ఎప్పుడూ చెప్పలేదు. 'ఆరాధ్యుడు ఒక్కడే' అని నమ్ముతున్నావా? అని అడిగాడు. ఆమె 'ఔను' అని సమాధానమిచ్చారు. తరువాత ముహమ్మద్ (స) దైవ సందేశహరుడు అని నమ్ముతున్నావా? అని అడిగాడు. మరలా తను 'ఔను' అని సమాధానమిచ్చారు. ఆమె అప్పటికే ముస్లిం అయిపోయినట్లు ఆయన తేల్చి చెప్పేసారు.

"**నేను ముస్లింనని చెప్పుకోవడానికి సంతోష పడుతున్నాను. ఇస్లాం నా జీవితం. ఇస్లాం నా గుండె చప్పుడు. ఇస్లాం నా రక్త నాళాలలో ప్రవహించే రక్తం. ఇస్లాం నా బలం. ఇస్లాం నా అద్భుతమైన, అందమైన జీవితం. ఇస్లాం లేకుండా నేను లేను. అల్లాహ్ తన చూపుని నా వైపు నుండి త్రిప్పితే నేను బ్రతకలేను.**"

తను ఇస్లాంను అర్థం చేసుకోవడానికి మాత్రమే ప్రయత్నిస్తున్నానని, తను క్రిస్టియన్‌నని వాదించారు. (అయితే ఆమెలో ఆలోచన మొదలైంది – 'నేను ముస్లింని కాగలనా? నేను ఓ అమెరికన్‌ని మరియు వాది తెల్లజాతి! నా భర్త ఏమంటాడు? నేను ముస్లింనైతే, నా భర్తకు విడాకులివ్వవలసి వస్తుందే, అయ్యో! నా కుటుంబం నాశనమైపోతుందే!?')

వారు మాట్లాడుకుంటూనే ఉన్నారు. 'జ్ఞానాన్ని సంపాదించడం మరియు ఆధ్యాత్మికతను అర్థం చేసుకోవడమనేది నిచ్చెన ఎక్కుతున్నంత స్వల్పమైనదని, నిచ్చెన ఎక్కేటప్పుడు, నిచ్చెన అడ్డుకర్రలు కొన్నింటిని దాటాలని ప్రయత్నించినప్పుడు, పడిపోయే ప్రమాదముందని చెప్పుకొచ్చాడాయన.

'షహాదా' (అంటే దేవుడు ఒక్కడే అని, ముహమ్మద్(స) అల్లాహ్ యొక్క సందేశహరుడు అని ప్రకటించడం) కేవలం నిచ్చెన పైన వేసే మొదటి అడుగు మాత్రమేనని' ఆయన వివరించారు.

అబుల్ హసన్

సత్యమే శాశ్వతమ్ము

ఇబ్రాహీమ్ (అ)ని అగ్నికి ఆహుతి చేశారని
చరిత్ర పుటల్ని చదివినప్పుడు
సత్యమేవ జయతే అని
డైరీలో నోట్ చేసుకున్నాను

పూజకు అర్హులుకాని అర్హత లేని ప్రభువుల్ని
ప్రతిమల్ని నిరసించడమే ఆయన చేసిన నేరం
చీకటిని పిడికిళ్ళతో పిండి మనస్సులోని
తమస్సును తరిమికొట్టడమే ఆయన చేసిన తప్పిదం!

వ్యక్తి పూజా విగ్రహ హారతి
రెండు కూడా కడు ప్రమాదం
సృష్టిశ్రేష్ఠుడు సృష్టిరాసుల ముందు
శిరస్సు వంచడం అవమానకరం
మానవత స్థానే దానవత
దాస్యభావన స్థానే దైవత్వం
క్షమించరాని పాపం
ఇదే ఆయన చేసిన హితం!

ఆయన హితులు వారి చెవినెక్కలేదు
అంతేనా, పైగా తమ
కభ్యంతరమని ఆయన్ను
మండే మంటల్లో విసిరేశారు!

ఓ మహాత్మా! ఓ మహర్షీ!
ఓ క్షమా పియూష వర్షీ!
ఓ తపస్వీ ఓ యశస్వీ
ఓ అహింసాశయ మనస్వీ
ఓ శాంతరూపయ తేజస్వీ

ఆదంలా నూహ్‌లాగా
సత్యబోధన చేశావు బాగా
సర్వ మానవ సమానత్వం
నీ జన్మ లక్ష్యం అదేగా
అమానుషత్వం పైశాచికత్వం
నీకు వైరం దాంతోనేగా

పనిదొంగను స్వామనాలా
దగాకోరును దైవమనాలా
లోఫరబ్బిని పీరనాలా
ధాఫరయ్యను దొరనాలా అని
తమస్సు తాండవానికి కెదురుగా
ఉషస్సు జ్యోతుల్ని వెలిగించావు కుదురుగా

చెప్పు దెబ్బలు దోమకాటుకు
సాతానైనా వెరచు వ్రేటుకు
నమ్రుదైనా ఒరగు నేలకు
కాటిలోనా కలిసిపోవు

అవును–
జయమ్ము నిశ్చయమ్ము!
సత్యమే శాశ్వతమ్ము!!
ఈ నూత సంవత్సర శుభ సమయాన శ్రోతలకిదే నా నజరానా!

ముహమ్మద్ హుసేన్ బొర్రా

పగటి కల పగిలిన తల



ముక్కుపుటాలదిరే డెట్టాల్ వాసనకు, భరించలేని తల నొప్పితో మెల్లగా కళ్ళు తెరచి చూసి పరిసరాలను క్షుణ్ణంగా పరిశీలించాక నాకు తెలిసిందేంటయ్యాంటే నేను మా ఊరి హాస్పిటల్లోనే ఒక మంచం మీదున్నాను. అక్కడున్న మంచాలన్నింటి మీద ఉన్న వాళ్ళందరూ శరీరమ్మీద ఏదో ఒక అవయవానికి బ్యాండేజి కట్లతో దర్శనమిచ్చారు. నాకేమైతే ఇక్కడ చేర్చబడ్డానో కదా అని క్షణకాలం కంపించిన నా మనసును ఓదార్చుతూ కళ్ళతోనే శరీర భాగాలన్నింటినీ ఒకసారి చూసుకున్నా, అంతా ఓకే. అయితే నేనిక్కడ ఎందుకు, ఎలా అని ఆలోచిస్తూ, ఈ తలనెప్పేంట్రా బాబూ అనుకుంటూ తలపై చెయ్యేస్తూనే రాజ్య భారం మోయలేని రారాజు నెత్తిన కిరీటంలా బెత్తెడెత్తు మందాన బ్యాండేజి మెల్లగా తగిలింది.

నా ఎదురుగా వున్న వాళ్ళందరికీ వాళ్ళకు సంబంధించిన వాళ్ళెవరో పక్కనే నిలబడి మందులిస్తూనో, సపర్యలు చేస్తూనో కనిపిస్తున్నారు.. నేనిక్కడికి వచ్చిన కారణమేంటో తెలుసుకుందామంటే నా పక్కన ఎవ్వరూ కనిపించటం లేదు. మరి కింకర్తవ్యమేంటీ అని ఆలోచిస్తున్న నాకు మా పక్కింట్లో ఉండే నా స్నేహితుడు అంజి గాడనే శెట్టిగారి ఆంజనేయులు కనిపించాడు. మా స్నేహానికి పాతికేళ్ళ వయస్సు.

నాకేమైందో తెలుసుకుందామని నోరు విప్పబోయేంతలో వాడే, ఏరా బావా లేచావా నేనింకా లేచిపోయావనుకున్నానే అంటుంటే **‘శుభం పలకరా పెళ్ళికొడకా అంటే పెళ్లికూతురు ముండేది”** అని అడిగిన సామెత గుర్తొచ్చి మనసు బాధగా మూల్గింది.

ఇచ్చోటికి నా ప్రస్థానం వెనకున్న కారణంబేదో తెలుసుకొనుటయే నా ప్రథమ కర్తవ్యమ్ము గాని వీడి వ్యర్థ ప్రశ్నలతో నాకేమని, మళ్ళీ వాడిని అడగబోయేంతలో మెల్లగా బంధువుల, స్నేహితుల, పరిచయస్తుల రాక మొదలైంది. ఆ వచ్చిన వాళ్ళలో మా చిన్న నాటి తెలుగు మేష్టారు, మా నాన్న గారి సహోపాధ్యాయులు రావూరు చిన్నయ్య గారు కూడా ఉన్నారు, ఎందుకో ఆయన్ను చూస్తూనే నా తలపై గాయానికి ఆయనకు ఏదో లింకున్నట్టనిపించింది. ఉరుము లేని వానలా వచ్చి నాయన వచ్చీరావడంతోనే, ఏంట్రా, తలపై అంత పెద్ద దెబ్బ ఎలా తగిలిందిరా భడవా, అయినా ఈ వయస్సులో కూడా క్రికెట్ ఆడట మేంట్రా అంట్ల వెధవా, నీ పిల్లలు పెరిగి పెద్ద వాల్లౌతున్నారు. కనీసం నీవయస్సుకన్నా గౌరవమియ్యలేకపోయావుట్రా మూర్ఖుడా అని తిట్ల వర్షంతో తడిపి ముద్దచేసిపారేసారు. అసలే తెలుగు మేష్టారు ఆపై వారి మాటలు కూడా రాగయుక్తంగా ఉండటం వల్ల ఆయన తిట్లతో తూట్లు పొడిచినా ఎవరూ ఆట్టే పట్టించుకోరు.

ఆయన ప్రశ్నలకు సమాధానంగా, మా అంజిగాడు మరేంలేదండోయ్ మేష్టారు గారు, మా బావగాడు బాత్‌రూంలో ఉండగా షర్ట్ కింద పడ్డదండి అంతే తలకు దెబ్బతగిలింది అని అంటూ ఉండగానే, షర్ట్ కిందపడటానికి తలకు దెబ్బ తగలటానికి సంబంధమేంట్రా అకృపక్షీ అని అనడం ఆ షర్ట్‌లోనే కదండీ వీడుంటాడు అని అంజిగాడనడం ఒకేసారి జరిగి పోయాయి. ఇదే సమాధానం నేనప్పుడెప్పుడో మా ఆవిడకి చెప్పినట్టు లీలగా జ్ఞాపకముంది.

మెల్లగా వచ్చిన వాళ్ళందరూ వెళ్ళిపోయాక మా అంజిగాడు సీరియస్‌గా, ఒరే బావా నిజం చెప్పు ఇది మా చెల్లాయి టెంకిజెల్ల ఎఫెక్టయితే కానేకాదు, మరేముచ్చుకొని కొడితే ఇంత భారీ ఎఫెక్టయ్యింది అనడిగాడు. ముందుగా టెంకిజెల్ల అనగానే ఒకానొక మా గురువు గారు గుర్తొచ్చి చిన్నగా నవ్వుకున్నాను. నేనింత సీరియస్ మాటర్ అడుగుతుంటే ఆ నవ్వేంట్రా నా కుక్క చింతకాయ అంటూ నా ఎదురుగా వచ్చి నిలబడ్డాడు. అంతసేపూ అసలు విషయాన్ని మరచిపోయిన నేను కూడా జరిగింది గుర్తు తెచ్చుకోవటానికి ప్రయిత్నించాను.

చివరాఖరుగా నాకు గుర్తున్నది, శనివారం పని తొందరగా అయిపోవటంతో ఒంటి గంటకు ఇంటికొచ్చి భోజనం చేసి కాసేపు నిద్ర పోవడం ఆ నిద్రలో ఒక కలగనడం, దాని ప్రభావంగా నిద్రలో ఏదో వాగడం వంటింట్లో ఏదో పనిలో ఉన్న మా ఆవిడ రావడం.. ఒక భారీ విస్ఫోటన శబ్దం... తర్వాత నేనిక్కడ స్పృహలోకి రావటం ఒకదాని వెంట ఒకటి నా మనోఫలకంపై రీలు తిరిగింది.

కానీ ఆ కల ఏంటో చప్పున జ్ఞప్తికి రాలేదు. అసలే మెదడంతా వేడెక్కి ఉంది. అందుకే ఇంకా దాని మీద ఒత్తిడి పెంచలేకపోయాను. కొంచెం విరామం తర్వాత మళ్ళీ జ్ఞాపకాల దొంతరను లాగడం మొదలుపెట్టాను. ఆ కలలో......

ఒక విశాలమైన పూదోట మధ్యలో ఒక అద్భుతమైన భవంతి కనిపించింది. నన్ను చూడగానే అక్కడున్న గేట్ కీపర్, రండి మీకు స్వాగతం అన్నాడు. వీడు నిజంగా నన్నే పిలుస్తున్నాడా లేక వేరేవారినా అనుకుంటూ పరిసరాలను గమనించాను. మళ్ళీ అతనే, మిమ్మల్నే సార్, లోపలికి దయచేయండి అనడంతో ముందడుగేస్తూ ఇదేంటోయ్ అనడిగాను. ఇది స్వర్గమండీ అని సమాధానమిచ్చాడు.

నా అదృష్టానికి లోలోనే పొంగిపోతూ అందులో అడుగెట్టాను. ఆహా ఏమా భవన సోయగం గోడలు పైకప్పు అంతా బంగారం మరియు వెండితో మెరిసిపోతున్నాయి. కానీ నాకెందుకో అక్కడెవరూ కనిపించలేదు. ఉన్నట్టుండి మనసులో దేవకన్యలెవరైనా కనిపిస్తే బాగుండు, లేకపోతే కనీసం నూనూగు మీసాల నూత్నయవ్వనమందు నేను ప్రేమించిన ఫజ్జో అయినా కనిపిస్తే బాగుండునని పించింది. ఊహూ లాభం లేదు. నలుపక్కలా కల్లు చికిలించుకొని చూసినా లాభం లేకపోయింది, కళ్ళకు సులోచనాలు లేకపోవటం వల్ల దూరంగా వున్నవేవీ అట్టే స్పష్టంగా కనిపించడంలేదు. ఏదైతే అదౌతుందనుకుని ముందడుగేసాను.



కొద్ది దూరంలో ఒక ఆకారం లీలగా నాకు చెయ్యూపుతూ కనిపించింది, ఆహా ఏమి నా అదృష్టము ఒక దేవకన్య నన్ను పిలుచుచున్నది కదా సంతోషంతో ముందుకు నడవసాగాను, ఆ ఆకారాన్ని దగ్గరగా చూసేటప్పటికి ఈ ముఖారవిందాన్ని ఎక్కడో చూసినట్టు జ్ఞాపకముందే అనుకున్నాను. ఆమె పదే పదే నా పేరు పెట్టి నన్ను పిలుస్తుండడంతో వెంటనే ఆమెను పోల్చుకుని “పండుగనాడూ పాత మొగుడేనా” నాకు కొత్తదనం కావాలి అంటూ పరుగు లంకించుకున్నాను, ఆవిడా నా వెనుకే వస్తోంది. ఎక్కడ దొరికి పోతానో అన్న భయంతో చిన్నగా కేకలేసుకుంటూ ద్వార బంధం తెరచుకొని బయటపడ్డాను. అక్కడ నేను చూసినావిడ మరెవరో కాదు: ఆవిడా మా ఆవిడే.

నిద్రలో నా కేకలకు భయపడి వంటింట్లో నుండి మా ఆవిడ రావడం నన్ను గట్టిగా తట్టి లేపడంతో ఆ పగటి కల నుండి బయట కొచ్చాను. ఏం జరిగిందని మా ఆవిడ అడుగుతూనే, గుండమ్మ కథలో ఎన్‌టీఆర్‌లా నిజం చెప్పమన్నావా, అబద్ధం చెప్పమన్నావా అని అందామనుకుని ఏమౌతుందిలే అనుకుని నిజాన్ని నిర్భయంగా చెప్పటం, కోపంతో ఊగిపోతూ చేతిలో ఉన్నదాంతోనే మా ఆవిడ నా నెత్తిన మోదటం నాకు స్పృహ తప్పటం అన్నీ ఒకదాని వెనుక ఒకటి జరిగిపోయాయి.

మామూలుగానే నా తలకు కొంచెం గట్టిదనమెక్కువ అలాంటిది మా ఆవిడ దెబ్బకు తల ఆకారమే మారిపోయినాదేమబ్బా అని ఆలోచిస్తుంటే నాకొక విచిత్రమైన రీజనింగ్ తట్టింది. హైస్కూల్‌లో ఎనిమిదో తరగతిలో అనుకుంటా రావూరు చిన్నయ్య గారి తెలుగు పీరియడ్లో వెరైటీగా వుంటుందని అమావాస్యను అమావేశ్య అనటం, ఆయన కోపంతో ఊగిపోతూ నా తలను గోడకేసి బాదటం వల్ల, అంతరిక్షానికెల్లే వ్యోమనౌకకు టేకాఫ్ సమయంలో థర్మల్ షీట్ ఊడిపోయినట్లు నా తల గోడపై కూడా ఎక్కడైనా సన్న పాటి బొక్కడి పోందేమో?

అంతా విన్న అంజిగాడు, గురజాడ అప్పారావ్ గారి కన్యాశుల్కం లో గిరీశంలా, “బావా! నీ పగటికల ఇతరులకో గుణపాఠం లాంటిదోయ్, నీ అనుభవాన్ని ఇతరులకు కూడా తెలియపర్చితే కనీసం కొంతమందైనా నిద్రలో ఎక్కువగా మరీ ముఖ్యంగా పగటి నిద్రలో వాక్కుండా ఉంటారు” అని సలహా ఇచ్చాడు.

ఇది నిజం

మరణానంతర జీవితం

“ఓ ప్రజలారా! ఒకవేళ మరణానంతర జీవితం గురించి మీకేదన్నా సందేహం ఉంటే కాస్త ఆలోచించండి... మేము మిమ్మల్ని మట్టితో సృష్టించాము, ఆ తరువాత వీర్యపు బొట్టుతో, ఆ పైన గడ్డకట్టిన రక్తంతో, అటు పిమ్మట మాంసపు ముద్దతో చేశాము- అప్పటికి అది రూపం కలదిగానూ, రూపరహితంగానూ ఉన్నది. మేము మీకు స్పష్టంగా తెలియజెప్పేందుకు (ఇదంతా చేస్తున్నాము) మరి మేము కోరిన దానిని నిర్ధారిత సమయం వరకు మాతృ గర్భాలలో ఉంచుతున్నాము. ఆ తరువాత మిమ్మల్ని శైశవ దశలో బయటికి తెస్తాము – మరి మీరు నిండు యౌవనానికి చేరుకోవటానికి! మీలో కొందరు (యుక్త వయస్సుకు చేరక ముందే) మృత్యువుకు గురి చేయ బడతారు. మరి కొందరు అన్నీ తెలిసి ఉండి కూడా ఏమీ గ్రహించలేనంత నికృష్టమైన వయస్సుకు చేర్చబడతారు. నేల ఎండి పోయి (బీడుగా మారి) ఉండటం నువ్వు చూస్తావు. ఆ తరువాత మేము దానిపై వర్షం కురిపించగానే అది పులకిస్తుంది, ఉబికి వస్తుంది, అన్ని రకాల మనోహరమైన మొక్కలను మొలకెత్తిస్తుంది.” (అల్ హజ్ : 5)

ప్రళయం

“ఓ ప్రజలారా! మీ ప్రభువుకు భయ పడండి. నిశ్చయంగా ప్రళయ సమయాన జరిగే ప్రకంపనం మహా(భీకర) విషయం. ఆ నాడు మీరు దాన్ని చూస్తారు... పాలు పట్టే ప్రతి తల్లీ పాలు త్రాగే తన పసికందును మరచిపోతుంది. గర్భవతుల గర్భాలూ పడిపోతాయి. ప్రజలు మైకంలో తూలుతున్నట్లు నీకు కనిపిస్తారు. వాస్తవానికి వారు మైకంలో ఉండరు. అయితే అల్లాహ్ (తరపున వచ్చిపడిన) విపత్తు అత్యంత తీవ్రంగా ఉంటుంది.” (అల్ హజ్: 1,2)

ప్రళయ దినం ఎంత భయంకరంగా ఉంటుందో ఈ ఆయతులో చెప్పబడింది. ఆ నాడు ఎవరి గొడవ వారిదే. అందరూ తీవ్రమైన కలవరానికి లోనవుతారు. భయంతో బెంబేలెత్తిపోతారు. కడుపు చించుకు పుట్టిన పసిబిడ్డల్ని సయితం తల్లి మరచి పోతుంది. గర్భిణీలకు గర్భస్రావం అయి పోతుంది. ఇది ప్రళయానికి ముందు పరిస్థితి. దాంతోనే ప్రపంచమంతా నాశనమై పోతుంది....అల్లాహ్ ఆదం (అలైహిస్సలాం) నుద్దేశించి, నీ సంతతిలో వెయ్యికి 999 మంది చొప్పున నరకవాసులను వేరు చెయ్యి అనంటాడు.... మహాప్రవక్త(స) ద్వారా ఈ సంగతి తెలుసుకున్న ప్రియ సహచరులు (ర) నిర్ఘాంత పోయారు. వారి ముఖకవళికలు మారిపోయాయి. అప్పుడు మహాప్రవక్త(స) వారినుద్దేశించి **“(కలవర పడకండి) ఆ 999 మంది యాజూజు మాజూజుల వర్గానికి చెందినవారై ఉం టారు. మీలోని ఒక్కడు మాత్రమే ఆ కోవకు చెందినవాడై ఉంటాడు. మీరు (సంఖ్యా పరంగా) జనులలో తెల్లని ఎద్దు దేహంపై నల్లటి వెంట్రుకలు ఎలా ఉంటాయో లేక నల్లరంగు ఎద్దు దేహంలో తెల్లటి వెంట్రుకలు ఎలా ఉంటాయో అలా ఉంటారు. స్వర్గవాసులలో మీరు.....సగానికి సగం ఉంటారని నేను ఆశిస్తున్నాను.”** అన్నారు. ఈ మాట వినగానే ప్రియ సహచరులు(ర) సంతోషాతిశయంతో ‘అల్లాహు అక్బర్’ అని నినదించారు.

(సహీహ్ బుఖారీ- అల్‌హజ్ సూరా వ్యాఖ్యానం)

మోసపోకండి

“ప్రజలారా! మీ ప్రభువుకు భయపడండి. ఏ తండ్రీ తన కుమారునికి ఉపయోగ పడని, ఏ కుమారుడూ తన తండ్రికి ఏ విధంగానూ ఉపయోగపడని దినానికి భయపడండి. అల్లాహ్ వాగ్దానం సత్య మైనది(అని తెలుసుకోండి) ప్రాపంచిక జీవితం మ్మిమ్మల్ని మోసపుచ్చటంగానీ, మోసగాడు(షైతాను) మిమ్మల్ని మోసగించ టం గానీ జరగరాదు సుమా!”

(లుఖ్మాన్: 33)

‘యజ్‌జీ’ అంటే అసలు బదులు ఇవ్వటం అని అర్థం. దీని భావం ఏమిటంటే తండ్రి తన కన్న కొడుకును కాపాడే ఉద్దేశంతో తన ప్రాణాన్ని బదులుగా ఇవ్వదలచినా లేక కొడుకు తన తండ్రికి బదులుగా తన ను తాను సమర్పించుకోగోరినా అక్కడ స్వీకార యోగ్యం కాజాలదు. ప్రతి ఒక్కరూ తాము చేసుకున్న దాన్ని తామే అనుభవించవలసి ఉంటుంది. తండ్రీ కొడుకులే ఒండొకరిని ఆదుకోలేనపుడు బంధుమిత్రుల సహాయం మాత్రం ఎలా స్వీకరించబడుతుంది?

మిడిసిపాటు మంచిది కాదు

“ప్రజలారా! మీ ఈ తిరుగుబాటు ధోరణి మీకే హానికరం. ప్రాపంచిక జీవితపు ప్రయోజనాలు కొన్నాళ్ళు మాత్రమే. ఆ తరువాత మీరు మా వద్దకే మరలి రావలసి ఉంది. అప్పుడు మేము, మీరు చేస్తూ ఉండిన కర్మలన్నింటినీ మీకు తెలియబరుస్తాము.”
(యూనుస్ : 23)

మీ మిడిసిపాటు కొన్నాళ్ళు మాత్రమే. ప్రాపంచిక జీవితం క్షణభంగురం. మీరు ఎంత అదిరిపడినా కడకు మా వద్దకు రాక తప్పదు. మీ చిట్టాపద్దులన్నీ మీ ముందు సమర్పించ బడతాయి. మీ దుష్కర్మలపై మిమ్మల్ని నిలదీయటం, శిక్షించటం కూడా ఖాయం.

నెలవంక ఉత్తరాలు

NELAVANKA OCTOBER- 2011

నెలవంకకు ఈమెయిల్ మరియు ఫేస్‌బుక్ ద్వారా అందిన ఉత్తరాలను యథావిధిగా ప్రచురిస్తున్నాము.

EXCELLENT

Thank you very much for your letter. A writer's great emotional need is to feel appreciated. It boosts the gusto of the writer to create better works.
Regarding your letter,i wish you all the best in your works.

i have gone through your letter and the attachment. thank you. excellent same views i wrote in my book. thank you again.Have a wonderful day,

Yours sincerely,
Veerendranath.
yandamoori@hotmail.com

IT IS VERY GOOD

Dear Friend, Gone trough your NELAVANKA. It is very good. Go a hed.
I am a Telugu writer. Brought 10 books on THE ROLE OF MUS LIMS IN THE STRUG GLE FOR THE FREE DOM OF INDIA.

Dear Brother, Gud very gud. Selec tion of subject and presentation is very gud. Go a head Brother. Langua ge is simple superb. It is according to the expression of subject. Nice Bro ther.

Syed naseer ahmed
naseerahamedsyed@gmail.com

Sir, nelavanka october- 2011 loni vya saalu cha la bagunnayi. Mukhyanga "manushula tollu kappu kunna tode llu" somaliya gurinchi vivaramuga telisindi. hrudayanni kalachi vesin di."vinodaala vinta jagatilo"bhayanni kalaginchi, aalochim pa jesindi. allah mi e krushini sweekarinchugaka "amin"

Shaik Riyaz



ఇస్లామీయ క్యాలెండర్

హిజ్రీ శకం ఎలా మొదలయింది?

దైవ అంతిమ ప్రవక్త ముహమ్మద్ (స) మక్కా నుంచి మదీనాకు వలస వెళ్ళడం (హిజ్రత్ చేయడం) అనేది ఇస్లామీయ చరిత్రలో ఓ మహత్తర సంఘటన. ఆయన (స) జుల్ హిజ్జా మాసం చివర్లో, ముహర్రం మాసం ప్రారంభంలో మక్కా నుంచి మదీనాకు వలస వెళ్ళారు. ఆ సంఘటననే తర్వాత హిజ్రీ శకం 17వ సంవత్సరంలో ఇస్లామీయ క్యాలెండరుకు ప్రారంభంగా హజ్రత్ ఉమర్ (ర) గారు ఖరారు చేశారు. ఆ ప్రకారం ఇస్లామీ క్యాలెండర్ నెలలు ఇవి–
1) ముహర్రం 2) సఫర్ 3) రబీవుల్ అవ్వల్ 4) రబీవుస్సానీ 5) జమాదివుల్ అవ్వల్ 6) జమాదివుస్సానీ 7) రజబ్ 8) షాబాన్ 9) రమజాన్ 10) షవ్వాల్ 11) జుల్ ఖఅదా 12) జుల్ హిజ్జా.
ఇప్పుడు మనం కొన్ని నెలలకు సంబంధించన సమాచారం తెలుసుకుందాం!

ముహర్రం

సంవత్సరంలో నెలల సంఖ్య 12 అయితే, అందులో నాలుగు నెలలు పవిత్రమైనవని అల్లాహ్ ఖుర్‌ఆన్‌లో పేర్కొన్నాడు. వాటిలో మొదటి మాసం ముహర్రమ్. చరిత్రను పరిశీలిస్తే ముహర్రం మాసం 10వ తేదికి ఎంతో ప్రాముఖ్యత ఉన్నట్లు తెలుస్తుంది. కాబట్టి ఈ రోజు ఉపవాసం పాటించవలసిందిగా దైవ ప్రవక్త (స) తన సముదాయాన్ని ప్రోత్సహించారు.

సఫర్

ఇస్లామీయ క్యాలెండర్ ప్రకారం ఇది రెండవ మాసం. ఈ మాసానికి సంబంధించి సమాజంలో అనేక అపనమ్మకాలు బహుళ ప్రచారంలో ఉన్నాయి. ఈ మాసం దుశ్శకునాలతో కూడినదని, ఈ మాసంలో వివాహాలు మొదలగు శుభ కార్యాలు జరుపుకోరాదని మూఢ నమ్మకాలను ప్రజలు కల్పించుకున్నారు. నిజానికి ఇస్లాం ఏ దినాన్ని, మరే రోజును, ఘడియనూ చెడుగా భావించదు. ఈ కారణంగానే ప్రవక్త (స) **"అపశకునంగా భావించి ముస్లిం తన పనులను మానేయ రాదు"** అని నొక్కి వక్కాణించారు.

(అబూదావూద్)

రబీవుల్ అవ్వల్

దైవ ప్రవక్త ముహమ్మద్ (స) రబీవుల్ అవ్వల్ 9 తేదిన జన్మించారు అని కొందరు 12వ తేదీన జన్మించారని మరికొందరు ధర్మ పండితులు అభిప్రాయపడ్డారు. అయితే ఆయన (స) మరణించిన తేది మాత్రం రబీవుల్ అవ్వల్ 12 అన్న విషయంలో అందరూ ఏకాభిప్రాయం కలిగి ఉన్నారు. ఏది ఏమైనా ప్రవక్త (స) వారు జన్మించారన్న సాకుతో పండగ జరుపుకోవడం ఎంత మాత్రం సమంజసం కాదు.

రబీవుల్ ఆఖర్

ఈ నెల 11వ తేది అల్లాహ్ ప్రసన్నత కోసం కాకుండా ధర్మ పండితులైె షేక్ అబ్దుల్ ఖాదిర్ (ర) ప్రసన్నత కోసం జంతువులను జిబహ్ చేసి 'గ్యారఃవీఁ' పేరుతో బంధువుమిత్రులకు భోజనాలు వడ్డిస్తారు. ఇది ముమ్మాటికి షిర్క్, బహుదైవారాధనే. దైవ ప్రవక్త (స) ఇలా సెలవిచ్చారు: **"అల్లాహ్ కోసం కాకూండా వేరితరుల కోసం పశువును జిబహ్ చేసిన వ్యక్తిని అల్లాహ్ శపిస్తాడు".** (ముస్లిం)

రజబ్

రజబ్ నెల 27వ తేది ప్రవక్త (స) మేరాజ్ యాత్ర చేశారన్నది కొందరు పండితుల అభిప్రాయం. దైవ ప్రవక్త (స) పూర్తి మెలకువలో సశరీరంగా ఆకాశయాత్ర చేశారు. ఈ ప్రయాణంలో దివ్య లోకాల స్థితిగతులను ఆయన కళ్లారా చూసి వచ్చారు. అయితే ఆ రోజును పురస్కరిమచుకొని ఉపవాసాలుండటం, జాగారం ఛేసి ప్రార్థనలు చేయడం సమంజసం కాదు.

షాబాన్

ఈ మాసంలో దైవ ప్రవక్త (స) అత్యధికంగా ఉపవాసాలుండేవారని విశ్వాసుల మాత హజ్రత్ ఆయిషా (ర) గారు తెలియజేశారు. అయితే ఈ నెల 15వ తేదీ కొంత మంది ముస్లింలు 'షబె బరాత్' పేరుతో రాత్రి జాగారాలు చేస్తారు. షాబాన్ 15వ తేదికి సంబంధించిన విశిష్ఠత రూఢి అయినప్పటికీ ఆ రాత్రి జాగారం చేయడం సబబు కాదు.





ప్రకటన

ఈ ఏడాదికి సంబంధించిన పూర్తి **నెలవంక** పత్రికలు పొంద గోరేవారు ఐపిసి సిటీ బ్రాంచ్‌ని సంప్రదించగలరు.

ప్రత్యేక శీర్షిక

కువైట్‌లో నివసించే ప్రవాసాంధ్రుల కోసం అంటూ ఓ ప్రత్యేక శీర్షిక ఇన్షాఅల్లాహ్ పాఠక మహోదయులను అలరించనున్నది.